# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం
23 ఏప్రిల్ 2026




## అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

### ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం

**కల్వకుర్తి ఏప్రిల్ 22 (నినాదం)**

తలకొండపల్లి మండలం, చీపునుంతల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మిడత పోశమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యం తో బాధపడుతు మరణించడం జరిగింది. బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ 3,000 వేల రూపాయలు అందజేశారు. పాటు వారి ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు అదే విధంగా గ్రామ ఉప సర్పంచ్ గుమ్మడి రాజు 2000 రూపాయలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో, ఎర్ర నరోత్తమ్ రెడ్డి, ఎర్ర జనార్దన్ రెడ్డి, మండ్ల వెంకటయ్య,బత్తుల బాలకుమార్ గౌడ్,నాయకులు, ఉప సర్పంచ్ గుమ్మడి రాజు , వార్డు సభ్యులు,చిను కుంట్ల రాజు,మెడమోని రాజు, ఎనుక అల్వాల్ రెడ్డి,మల్లేష్,బ్రహ్మ చారి, గోసికె గిరి, గోసికె మధు, గొస్కే మల్లేష్ , గుమ్మడి చెన్న కేశవులు ,మల్తుంకర్ నగేష్,పిరికిరాల కృష్ణ గుమ్మడి రామకృష్ణ బత్తుల బాలకృష్ణ, గోసికే శ్రీను, ఉదరి పార్వతాలు, బందరు రాములు, పిరికిరాల శిలారి, తదితరులు పాల్గొన్నారు.



## లింగరావుపల్లి, రామకృష్ణ పురం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### మగ్గం వర్క్ ప్రారంభించిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి ఏప్రిల్ 22 (నినాదం)**

యూనియన్ ఆర్ సిటీ ముచింతల్ స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లింగరావుపల్లీ లో మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డీ ఈ కార్యక్రమం ఒక నెల రోజుల పాటు కొనసాగుతుంది. మధ్యాహ్నం భోజనం మరియు స్నాక్స్ సదుపాయాలు కలుగచేస్తున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డీ ఉప సర్పంచ్ బూత్కూరి వెంకట్ రెడ్డీ గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి వార్డు సభ్యులు బండగల జంగయ్య బొచ్చుపల్లి శేఖర్ టేకూరి సుమన్ డైరెక్టర్ సురేంద్ర బాబు ఏపీఎం రామస్వామి సిసి దీప శివ రామంజమ్మ వి వో ఎ సాత్విక మమతా వనజ గ్రామ నాయకులు గ్రామ పెద్దలు ఆడపడుచులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



## దొడ్డు వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ మానాలను కలిసిన పలువురు సర్పంచులు

**ఆర్మూర్, ఏప్రిల్ 22( నినాదం):**

రైతులు పండించిన దొడ్డు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసేలా, వరి ధాన్యం పండించిన రైతుల ఇబ్బందులను తొలగించాలని నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ భీంగల్ మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, భీంగల్ మున్సిపల్ కౌన్సిలర్లు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ రాష్ట్ర చైర్మన్ మానాల మోహన్ రెడ్డిని స్వయంగా కలిసి దొడ్డు వరి ధాన్యం పండించిన రైతులు పడుతున్న గోడును మానాల మోహన్ రెడ్డి దృష్టికి బుధవారం రోజున తీసుకువెళ్లారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డికి మండలంలోని దేవక్క పేట సర్పంచ్ అజయ్, భీంగల్ మున్సిపల్ కౌన్సిలర్ సంగ్య నాయక్, కారేపల్లి సర్పంచ్ మోతిలాల్ నాయక్, రహత్ నగర్ సర్పంచ్ తిరుపతి, తాళ్లపల్లి సర్పంచ్ గోవింద్, మాజీ ఎంపీటీసీ బాబూలాల్, కారేపల్లి కిషన్ నాయక్, తాళ్లపల్లి గోపాల్ నాయక్, రహత్ నగర్ రాజేష్, కారేపల్లి ఉపసర్పంచ్, పలువురు ప్రజాప్రతినిధులు మానాల మోహన్ రెడ్డిని కలిసి వరి దొడ్డు ధాన్యం విషయమై రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు మానాల మోహన్ రెడ్డి స్పందించి జిల్లా జేసీతో ఫోన్లో మాట్లాడారు, రెండు రోజులలో రైస్ మిల్లులు ప్రారంభిస్తామని, తదనంతరం వరి దొడ్డు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా జెసి హామీనిచ్చినట్లు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి ప్రజా ప్రతినిధులకు తెలియజేశారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.. ఆర్టీసీ బస్సులను, ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 22, (నినాదం):**

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో నారాయణపేట జిల్లాలో చట్ట ప్రకారం శాంతి భద్రతలను కాపాడేందుకు జిల్లా పోలీస్ శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు , ఉద్యోగులు , అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చినా , అలాగే ఆర్టీసీ డ్రైవర్లు తిరిగి డ్యూటీలో చేరినా , వారికి ఎటువంటి బెదిరింపులు లేకుండా పూర్తి స్థాయిలో పోలీస్ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్సుల రాకపోకలు , డిపో ప్రాంతాలు , ముఖ్య కూడళ్లు, బస్టాండ్ పరిసరాల్లో అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా , ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా , అధికారులపై దాడులకు పాల్పడినా , అలాంటి వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం , వదంతులు వ్యాప్తి చేసిన వారిపైనా పర్యవేక్షణ కొనసాగుతోందని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమ్మెలో పాల్గొనే కార్మికులు ప్రజలు పరస్పర గౌరవం పాటిస్తూ, ఎలాంటి ఉద్రిక్తతలకు తావు లేకుండా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికులు తమ సమ్మేను శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదు, ఎక్కడనైనా శాంతి భద్రతలో వీగాతం కలిగించేటట్లు చర్యలు చేపడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు మరియు వారి ఉద్యోగ పరంగా యాక్షన్




తీసుకోవడం జరుగుతుందనీ అన్నారు. ప్రజల శాంతి భద్రతలను కాపాడటంలో పోలీస్ శాఖకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని కోరారు.

## అంబారుపేట పశుసంవర్ధక ఉప కేంద్రానికి ఆమోదం

### కృతజ్ఞతలు తెలియజేసిన 3 వ వార్డు కౌన్సిలర్ బెజ్జం రాజు మరియు కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకులు

**మధిర, ఏప్రిల్ 22(నినాదం):**

మధిర మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా పయనం చేస్తుందటలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక & విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క నిరంతర కృషి, దూరదృష్టి ఫలితంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని అంబారుపేట గ్రామానికి మరో ముఖ్యమైన అభివృద్ధి పథకం మంజూర అయింది. అంబారుపేట గ్రామంలో కొత్తగా పశుసంవర్ధక ఉపకేంద్రం (ఏ హెచ్ సబ్ సెంటర్) ఏర్పాటు చేయ డానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉపకేంద్రం స్థాపనకు మొత్తం రూ.55, 23,000/-మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక సేవలను బలోపేతం చేయడం, రైతులకు సమీపం లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా ఈ కేంద్రం ఏర్పాటు అవుతుంది. దీని ద్వారా అంబారుపేట తో పాటు, పరిసర గ్రామాల పశుపోషకులకు టీకాలు, చికిత్స, ఆధునిక సేవలు సులభంగా అందుబాటులోకి రానున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కట్టుబడి పని చేస్తున్న మల్లు భట్టి విక్రమార్క ప్రజల మనిషిగా, మధిర ప్రాంత అభివృద్ధికి వరుసగా పథకాలను తీసుకువస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవడంతో పాటు, రైతుల ఆదాయం పెరిగి, ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుంది. పశు



సంవర్ధక రంగం అభివృద్ధి చెందటంతో రైతుల్లో అవగాహన పెరిగి, ఆధునిక పద్ధతులు అలవాటు కావడంతో వారి ఆలోచన విధానం కూడా మరింత మెరుగుపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా మధిర మున్సిపాలిటీ ప్రాంత ప్రజలు మల్లు భట్టి విక్రమార్క కు కృతజ్ఞతలను తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో మధిర మున్సిపల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తా, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు డా. వాసిరెడ్డి రామనాథం, తన్నీరు రామకృష్ణ, పారుపల్లి విజయ్, సుధాకర్, మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన దని కుమార్, మ3 వ వార్డు అధ్యక్షుడు నాగబోయిన రామారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్నాటి శ్రీను, చిలక శైలజమరియు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఉన్నారు.




## ఆర్టీసీ కార్మికులకు మధిర బిజెపి నాయకుల సంఘీభావం

**మధిర, ఏప్రిల్ 22 (నినాదం):**

మధిర ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 22వ తారీకు నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె లో పాల్గొన్న టువంటి కార్మికుల ప్రధానమైనటువంటి డిమాండ్లు ఈ విధంగా ఉన్నాయి. ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం మరియు 2025 వేతన సవరణలు వెంటనే అమలు చేయాలి. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలి. కారుణ్య నియామకంలో ఉన్న వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. ఈ ప్రధానమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న కార్మికులకు మధిర భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు రామిశెట్టి నాగేశ్వరరావు, చిలివేరు సాంబశివరావు తమ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ సమస్యల కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లవేళలా మీకు సహాయ సహకారాలను అందించి మీ సమ్మె విజయవంతం అయ్యేదాకా, మీ న్యాయమైన కోరికలు తీరేదాకా మేము అండగా ఉంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బియ్యవరపు రామకృష్ణ, పగడాల నాగేంద్రబాబు, అజర్, ఆంజనేయులు తదితరులు పాల్గొనడం జరిగింది.




### మానవత్వం పరిమళించిన వేళ యాచకులకు అండగా

## సీనియర్ కాంగ్రెస్ నేత గురుజాల గోపి



**0మణుగూరు ఏప్రిల్ 22(నినాదం):**

దిక్కులేని వారికి దేవుడే దిక్కనే శ్రీ శ్రీ రాసిన కవిత్వం వాస్తవ రూపంలో నిజాన్ని సంతరించుకుంది. కన్నవారు అయినవారు కర్కోటకంగా మారడంతో కన్నతల్లిదండ్రులని రోడ్డుపై వదిలేసి దిక్కులేని వాళ్లను చేసిన తల్లిదండ్రులు యాచకులుగా మారిపోయారు. రోడ్డుపై భిక్షాటన చేస్తూ తిరుగుతూ నడవలేని స్థితిలో ఓ చెట్టు కింద విశ్రాంతి తీసుకున్న సమయంలో అటుగా వెళుతున్న కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి వారిని చూసి ఆయన చెలించిపోయారు. వారిని చూచి పరిస్థితిని ఆకలింపు చేసుకొని, ఆయన స్పందించారు. మానవత్వం పరిమళించింది, వెంటనే ఆయన స్పందించి రేణుక చౌదరి అక్షర మహిళా మండలి కార్యాలయంకి తరలించారు. బుధవారం వారి వివరాలు సేకరించి వేరే ప్రాంతం నుంచి యాచకులుగా మారి కన్నబిడ్డలకు దూరమై దిక్కు తోచని స్థితిలో ఉండిపోయినట్లు వారు వెల్లడించారు. వారికి కన్న కొడుకుగా దయాశీలుడిగా మారిపోయిన గురజాల గోపి వారికి నేనున్నానంటూ హామీ ఇచ్చి వారిని పూర్తిస్థాయిలో ఆదుకోవడం జరిగింది. వారికి కావలసిన కొత్త దుస్తులు పాదరక్షకులు ఆర్థిక సహాయం అందించి, వారికి కడుపునిండా భోజనం అందించి పూర్తిస్థాయిలో ఆదుకోవడం జరిగింది. దీంతో ఆ వృద్ధ యాచకులు చలించిపోయి కన్నీరు మున్నేరుగా విలపిస్తూ ఆయనకు కృతజ్ఞతలు చెబుతూ వారు చెలించి పోయారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ సమాజంలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలతో పాటు వ్యక్తిగతంగా కూడా సహాయం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. వీరికి ప్రభుత్వం కల్పించిన సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన పేర్కొన్నారు. పేదలను ఆదుకోవడం మంచి మనుషుల మనస్తత్వం లక్షణమని అన్నారు. మంచిగుణగణాలు ఉన్నంతకాలం మానవత్వం ఎప్పటికీ చనిపోదని ఆయన అభిప్రాయపడ్డారు. నేటి సమాజంలో స్వార్థం పెరుగుతున్న తరుణంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు అరుదుగా కనిపిస్తాయని స్థానికులు సైతం పేర్కొన్నారు. ముఖ్యంగా యువత ఇటువంటి కార్యక్రమాలు పట్ల స్ఫూర్తిదాయకంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. అవసరమైన వారికి అండగా నిలవడం నిజమైన సేవ అని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. వృద్ధయాజకులను ఆదరించడం మణుగూరు పట్టణంలో మానవత్వం చిరస్మరణీయంగా బ్రతికి ఉన్నట్లు గురజాల గోపి నిరూపించారు. ఈ సమాజంలో మార్పులు తీసుకురావాలంటే ఇలాంటి చిన్న చిన్న ప్రయత్నాలే పెద్ద మార్గాన్ని చూపిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డి బోయిన రేణుక, కన్నాపురం శైలజ, బానిస పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## తప్పట్ల మోరుసులో తండ్రి కొడుకులపై దాడి అమానుషం

### భీమ్ ఆర్మీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జి మాచర్ల ప్రకాష్

**గద్వాల బ్యూరో ఏప్రిల్ 22వ (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం, తప్పెట్ల మరుసు గ్రామంలో నిరుపేద మాదిగ కులానికి చెందిన జయంత్ వారి తండ్రి మీద దాడి చేసిన నలుగురు ఇడిగ కులస్తుల మీద కఠిన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జి మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు నిన్న తపెట్ల మరుసు గ్రామంలో మా పొలంలో టిప్పర్లు ఎందుకు వెళ్తున్నాయి అని జయంతు వారి తండ్రి ఇడిగా కులానికి చెందిన నాగన్న గౌడ్,శంకర్ గౌడ్, కొండన్న గౌడ్ బలరాం గౌడ్ , రామాంజనేయులు గౌడ్ లను ప్రశ్నించినందుకు వారు కోపోద్రికులై మాదిగ కొడకల్లారా అని కులంపేరు దూషించి దాడి చేయడం జరిగింది . ఈరోజు గట్టు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ నుండి డిమాండ్ చేశారు , తపెట్లమరుసు గ్రామంలో దళితులను ఇడిగ కులానికి చెందిన కొంతమంది అణచివేస్తూ కులవివక్షతో వారిని అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారు వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలి, మొన్నటికి మొన్ననే ఒక దళితుడు



చనిపోతే శవాన్ని తీసుకు వెళుతుండగా కొంతమంది ఈడుగా కులస్తులు అడ్డుకొని మాకు గుంతలు తీయాలని వీరిని భయభ్రాంతులకు గురి చేస్తూ శవాన్ని పూడ్చనివ్వకుండగా అడ్డుకొని అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిన సంఘటన కూడా మొన్ననే చూసాము ఇట్టి దుర్మార్గాలు కొంతమంది ఈడిగ కులానికి చెందిన వ్యక్తులు చేస్తున్నారు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఖండిస్తున్నాం దళితుల మీద దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీ, రాష్ట్ర డీజీపీ గారిని భీమ్ ఆర్మీ మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేస్తూ విజ్ఞప్తి చేశారు కార్యక్రమం లో బాధితులు జయంత్, వారి తండ్రి, మరియు తపెట్లమరుసు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను ఇబ్బందులు పెట్టే మధిర వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీని రద్దు చేయండి

### సూర్యదేవర కోటేశ్వరరావు

**మధిర, ఏప్రిల్ 22 (నినాదం):**



ప్రజలను ఇబ్బందులు పెట్టే మధిర వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ ని రద్దు చేయాలని, గ్యాస్ వినియోగదారులకు వెంకటేశ్వర ఏజెన్సీ సేవలందించడంలో విఫలమైందని, సిలిండర్ పై అదనపు రుసుమును వసూలు చేస్తున్నారని, గ్యాస్ వినియోగదారులకు సమయానికి గ్యాస్ సరఫరా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రతిరోజు వందల మంది మధిర గ్యాస్ గోడౌన్ ఏజెన్సీ దగ్గర క్యూ కడుతున్నారని, వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్న సరైన సమయానికి గ్యాస్ ఇవ్వకపోవడంతో ఎర్రని ఎండలో గ్యాస్ కోసం ప్రజలు తిప్పలు పడుతూ, క్యూలో నిలబడుతున్నారని అన్నారు. గత కొన్ని నెలలుగా వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఇదే తీరును ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఒకవైపు ప్రభుత్వాలు గ్యాస్ కొరతలేదని చెబుతా ఉంటే, ఏజెన్సీ నిర్వాహకులు అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని, వినియోగదారులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వేలాది మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసిన నెల రోజులు పైనవుతున్న సరఫరా చేయడం లేదని, వినియోగదారులు ఆవేదన చెందుతున్నారని ఆయన తెలిపారు. మిగిలిన గ్యాస్ ఏజెన్సీల దగ్గర పరిస్థితి సాధారణంగానే ఉంటే, ఒక్క మధిర వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ దగ్గర మాత్రం జనం సిలిండర్ల కోసం పడిగాపులు కాస్తున్నారని, మధిర ఏజెన్సీ లోనే ఎందుకు స్టాకు లేదని ఆయన ప్రశ్నించారు. అలాగే డెలివరీ బాయ్స్ సిలిండర్ డెలివరీ ఇచ్చేటప్పుడు 20 నుంచి 30 రూపాయలు అదనంగా చార్జ్ వసూలు చేస్తున్నారని ఆయన అన్నారు. గ్యాస్ సిలిండర్లను తగిన సమయంలో అందించలేకపోతున్న వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ మీద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.




## గ్రామపంచాయతీకి బాడీ ఫ్రీజర్ అందజేసిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

### గ్రంథాలయ అభివృద్ధికి పలు యువజన సంఘాలు ముందుకు రావాలి

**ఆర్మూర్, ఏప్రిల్ 22 (నినాదం):**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండలంలోని రామన్నపేట గ్రామపంచాయతీకి, గ్రామ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు బుధవారం జిపి.పాలకవర్గ సభ్యులకు బాడీ ఫ్రీజర్ను అందజేశారు. ఈ సందర్భంగా బాడీ ఫ్రిజర్ను అందజేసిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులను జి.పి.పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం జిపి పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ, రామన్నపేట గ్రామపంచాయతీలో విద్యార్థుల, యువత మేధస్సును పెంపొందించేందుకు గ్రంథాలయం నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ గ్రంథాలయంలో ఫర్నిచర్, పలు వివిధ రకాల పుస్తకాలు అందించి అభివృద్ధికి, పలు గ్రామ యువజన సంఘాలు ముందుకు వచ్చి సహకరించి గ్రంథాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలు యువజన సంఘాల సభ్యులు, జిపి పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, కారోబార్, గ్రామ ప్రజలు, తదితరులు,పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత

### మా ఇసుక-మా వాహనంలో ఆన్లైన్ లో డబ్బులు చెల్లించి నమోదు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు.. కలెక్టర్‌కు మాజీ ఎంపీపీ ఫిర్యాదు

**ఆర్మూర్, ఏప్రిల్ 22 (నినాదం):**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మళ్ళీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టడం జరిగిందని కమ్మర్పల్లి మండల మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ నారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అతి చౌక ధరకే ఇసుకను నేరుగా లబ్ధిదారులకు అందించేందుకు, మరోపక్క అవినీతి అక్రమ ఇసుక రవాణా నియంత్రణ కళ్లెం వేసేందుకు, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా మా ఇసుక -మా వాహనం అమలు చేసినప్పటికీ, అధికారుల పేరాశ, నిర్లక్ష్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై చిత్తశుద్ధి అధికారులకు లేకపోవడం, ప్రభుత్వ ఇందిరమ్మ ఇండ్ల పథకాలపై అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని మాజీ ఎంపీపీ అంజమ్మ నారాయణ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక కోసమై మా ఇసుక మా వాహనం యాప్ లో ఆన్లైన్లో లబ్ధిదారులు డబ్బులు చెల్లించి నమోదు చేసుకున్న, నెలరోజులు గడిచిపోతున్నప్పటికీ, ఇప్పటివరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక అందించకపోవడం పట్ల ఇందిరమ్మ నిర్మాణ లబ్ధిదారుల బాధితులు ఆవేదన వెళ్లబోసుకుంటున్నారని మాజీ ఎంపీపీ అంజమ్మ అన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండలం కోన సముందర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత తీవ్ర ఆటంకంగా మారిందని మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ నారాయణ ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కు ఇసుక కొరత నెలకొందని ఈ విషయమై ఈనెల 7వ తేదీన నిజాంబాద్ జిల్లా కలెక్టర్ కు స్వయంగా వెళ్లి వినతిపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. దీంతో సమస్య విన్న జిల్లా కలెక్టర్ స్పందించి స్వయంగా కలెక్టర్ మైనింగ్ ఏడిని పిలిచి వెంటనే ఇసుక సమస్యను పరిష్కరించి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పూర్తిగా జరిగేలా, ఇంకా సమస్య జటిలం కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, జిల్లా కలెక్టర్ ఆదేశాలు సైతం అధికారులు బేకాతర్ చేయడం పట్ల విశ్వాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 14 ట్రిప్పుల ఇసుక కు గాను మా ఇసుక మా వాహనంలో ఆన్లైన్ ద్వారా డబ్బులు చెల్లించి నమోదు చేసుకుని నెలరోజులవుతున్న, ఇప్పటివరకు ఇసుక అందించలేదని ఆమె పేర్కొన్నారు. నెల రోజులు గడుస్తున్నా ఇసుక తరలింపుకు సైతం అనుమతులు ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా భీంగల్ ఇసుక పైనుండి ఇసుక తెచ్చుకోవడానికి గ్రామస్తులకు చెందిన సొంత ట్రాక్టర్లకు అనుమతిని నిరాకరిస్తున్నారని, దీంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని వినతిపత్రంలో మాజీ ఎంపీపీ అంజమ్మ




కలెక్టర్కు విన్నవించారు. ఇసుక కొరత కారణంగా, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు అప్పు చేసి కంకర, ఇనుము, ఇటుకలు తెచ్చుకొని ఇంటి ముందు రోడ్డుపైనే పడి ఉన్నాయని, తెచ్చుకున్న సామాగ్రి సైతం పాడవుతుందని ఆమె అన్నారు. దీంతో గ్రామంలో రాకపోకలకు సైతం ఇబ్బంది కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంద్రమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, కానీ క్షేత్రస్థాయిలో అధికారుల సమన్వయ లోపం, అధికారులు ఇత్తరాజ్యంగా వ్యవహరించడం వల్ల లబ్ధిదారులకు ఇబ్బంది పడుతున్నారని ఆమె అన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి, సొంత ట్రాక్టర్ల ద్వారా ఇతను తరలించుకునేలా అనుమతులు మంజూరు చేయాలని, ఇళ్ల నిర్మాణాలు సజావుగా ముందుకు సాగేలా చూడాలని కమ్మర్పల్లి మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ నారాయణ మరోసారి జిల్లా కలెక్టర్ ను కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఇదే విషయమై మరోసారి జిల్లా కలెక్టర్ ను కలిసి ఇసుక కొరత పట్ల, అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై మరోసారి ఫిర్యాదు చేస్తానని అంజమ్మ స్పష్టంగా పేర్కొన్నారు.



## సింగరేణి గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు యూనిఫామ్స్ పంపిణీ

**కొత్తగూడెం, ఏప్రిల్ 22(నినాదం)**

సింగరేణిలో కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో ఇల్లందు బంగ్లోస్, చిల్డ్రన్ పార్కు ఏరియా, హెడ్ ఆఫీస్, మెయిన్ హాస్పిటల్ తదితర పార్కులలో పనిచేస్తున్న గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు బుధవారం యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేడబ్ల్యు కృష్ణఫర్ మాట్లాడుతూ.. సింగరేణి పార్కులలో పనిచేస్తున్న గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు సుమారు పది సంవత్సరాల పైనుండి విధులు నిర్వహిస్తున్నారని, వీరికి ప్రారంభం నుండి యూనిఫార్మ్స్ ఇతర సౌకర్యాలు లేని నేపథ్యంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు, కృషి ఫలితంగా గతంలో సీఎంపిఎఫ్, బ్యాంక్ జీతాలు ఇతర సౌకర్యాలు సాధించుకోవడం జరిగిందని, నేడు యూనిఫామ్స్ కూడా సాధించుకున్నామని తెలిపారు. అందుకు సహకరించిన కార్పొరేట్ ఫారెస్ట్ విభాగం అధికారులకు, కాంట్రాక్టర్లకు యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ ఏ.ప్రభాకర్ రెడ్డి, సూపర్వైజర్స్ సందీప్, రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గురువారం । తెలంగాణ
23 ఏప్రిల్ 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

# ఆర్టీసీ సమ్మె సంపూర్ణం
## సమ్మెలో 98 శాతం మా ఉద్యోగులు

**నల్లగొండ ఏప్రిల్ 22(నినాదం):** జేఏసీ ఆర్టీసీ ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం చేపట్టిన సమ్మె మొదటి రోజు సక్సెస్ అయ్యింది. ఉద్యోగులంతా ఏకతాటిపై వచ్చి సమ్మె కు జై కొట్టారు.అధికారులు ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నం చేసిన లొంగకుండా సమ్మెలో పాల్గొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ సమ్మెలో 708 బస్సులకు గాను 234 బస్సులు మాత్రమే రోడ్డుపై తిరిగాయి. ఈ బస్సులు పూర్తిగా అదే బస్సులు మాత్రమే.. ఇవీ కండక్టర్ లేకుండా డ్రైవర్ తో నడిచే బస్సులు మాత్రమే. మొత్తం బస్సులలో 35% మాత్రమే రోడ్డెక్కినట్లు తెలుస్తుంది. ప్రభుత్వంలో ఉన్న ఆర్టీసీ బస్సులు కేవలం మూడు మాత్రమే నడిపారు. 98 శాతం మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొని ప్రభుత్వంపై తమ నిరసనను స్పష్టం చేశారు. సమ్మె కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు ఒక్కరోజే సుమారు కోటి రూపాయలకు పైగా నష్టం జరిగిందంటూ ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

**ప్రయాణికుల అవస్థలు**
ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రధాన నగరాల్లో మాత్రమే బస్సులు



నడిచాయి . గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం పూర్తిగా బంద్ అయింది. పెళ్లిళ్ల సీజన్ కావడం, దానికి తోడు ఎండ తీవ్రత తీవ్రంగా ఉండడంతో ప్రజలంతా రవాణా సౌకర్యం సక్రమంగా లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సుల బంద్ కారణంగా ప్రయాణికులు ప్రైవేటు వాహనాలు ప్రయాణించేందుకు ప్రయత్నించగా అధిక చార్జీల వసూలు చేయడంతో ఇబ్బందులు పడ్డారు. కనీసం ఆటో సౌకర్యం లేని గ్రామాలకు వెళ్లాల్సిన వాళ్లు రోజంతా బస్టాండ్లలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**భారీ బందోబస్తు**
ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొన్ని డిపోలలో అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ ఆర్టీసీ ఉద్యోగులు విధులకు హాజరు కాకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శలు కూడా వినిపించాయి. అయితే అలాంటి ఇబ్బందులకు ఎవరు గురిచేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ పోలీసులు బహిరంగంగానే ప్రకటించారు. ఉదయం నాలుగు గంటల నుంచి పోలీసులంతా ఆయా బస్టాండ్లను పాగా వేశారు.

**చావో రేవో తేల్చుకుంటాం...**
**యారా చంద్రయ్య.. ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకుడు.**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, పే స్కేలు, ఏరియర్స్ చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. అందుకే ఇచ్చిన హామీనీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం. గత ఏడాది మే నెలలో సమ్మె చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, మాయ మాటలు చెప్పి సమ్మెను నిలిపివేసింది. కానీ ఇప్పుడు ప్రభుత్వంతో చావు తేల్చుకుంటాం . ఎప్పుడు మా సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ ఎప్పుడు సాధ్యం కాదు

# ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య... మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య

**సుల్తానాబాద్, ఏప్రిల్ 22(నినాదం):** ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుం దని మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య స్ప ష్టం చేశారు. సుల్తానాబాద్ మండలం గ్రామంలోని చిన్న బొంకూర్ యుపిఎస్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా మండల విద్యాధికారి హాజరై మాట్లా డుతూ, నిష్ణాతులైన అనుభవజ్ఞులైన ఉపాధ్యా యులు అంకితభావంతో పనిచేస్తున్నారని వీరిని ఆదరించి ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించుకోవా. లని కోరారు. అనంతరం మరో ముఖ్య అతిథి గ్రా మ సర్పంచ్ అబ్బోజు సునీత బ్రహ్మచారి హాజరై మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధి కోసం అన్నివి ధాల సహకరిస్తా మని,పాఠశాలలో అంకిత భావం తో పనిచేస్తున్న కిషన్ సేవలను కొని ఆడారు.పా ఠశాల వార్షికోత్సవంలో గ్రామంలోని చెరుకు రామ్ రెడ్డి, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయు రాలు సుచేత మేడం, ఇదే పాఠశాలలో పనిచేస్తున్న స్తున్న



ఉపాధ్యాయుడు సుధాకర్ పేరెంట్ శ్రీ అబ్బోజు సతీష్ పాఠశాలలకు విరాళా లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో.



పాఠశాల ఉపాధ్యాయులు ఆకుల కిషన్ ,శ్రీధర్ కుమార్ ,స్వప్న కుమారి, పరమేష్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ కార్మికుల సమ్మెపై
# మంత్రి జోక్యం చేసుకోవాలి
## సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్



**మంథని టౌన్ ఏప్రిల్ 22 (నినాదం):** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కొరకు ఆర్టీసీ కార్మికులు రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో భాగంగా మంథని ఆర్టీసీ డిపో కార్మికులు విధులు బహిష్కరించి గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఆర్టీసీ కార్మికుల ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్ గా ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఉన్నారు కాబట్టి మంత్రి వెంటనే స్పందించి ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో జోక్యం చేసుకొని ఆర్టీసీ సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ఆర్టీసీ యాజమాన్యం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తుందని శిక్షణలేని డ్రైవర్లతో బస్సులు నడిపించడం వల్ల బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయ న్నారు.

రాష్ట్రంలో ఏ బస్సు ప్రమాదానికి గురైన ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ పెద్ద సంక్షేమ రంగమని గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణాలు చేస్తున్నారని ఇలాంటి సేవా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజల అందరి పైన ఉందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల న్యాయపం మైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేసి ఆర్టీసీని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్, ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవ వేడుకలు..
## భూ రక్షణ అందరి బాధ్యత: కేజీబీవీ స్పె షల్ ఆఫీసర్






**సుల్తానాబాద్, ఏప్రిల్ 22(నినాదం);**ఏప్రిల్ 22 న 56వ ప్రపంచ ధరిత్రి దినోత్సవంను పురస్క రించుకొని భూపతిపూర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో అవర్ పవర్ అవర్ ప్లాంట్ 2026 థీమ్ తో ఘనంగా విద్యార్థులకు రకరకాల కార్యక్రమాలు, వివిధ పోటీలను నిర్వహించారు .ఇందులో భాగంగా విద్యార్థులకు రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యము వలన గ్లోబల్ వార్మింగ్ పెరిగి భూమి వేడెక్కుతుందని, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ వలన వాతావ రణ మార్పులకు కారణమవుతుం దని,భూ కాలుష్యం వలన మానవ జాతికి ము న్ముందు ముప్పు పెరుగుతుందని అన్నారు. వీట న్నిం టినీ నివారించడానికి పునరుద్ధరించబడే వ నరులను ఎక్కువగా వినియోగించాలని, చెట్లను పెంచాలని, భూ కాలుష్యా నికి కారణ మయ్యే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. ధరిత్రీ దినో త్సవం గురించి విద్యార్థినులకు అవగాహన కలిగించుటకు సేవ్ ఎర్త్, సేవ్ ఎనర్జీ అంశం పైన వ్యాస రచన పోటీలు, చిత్రలేఖన పోటీలు, నినా దాల పోటీలు, పదజాల పోటీలు, పద్య రచన, నాటిక ప్రదర్శన, పాటల పోటీలు, నృత్య ప్రదర్శ నలు, విత్తన బంతుల తయారీ, బట్ట సంచుల పంపిణీ,మాన వహారం ,చెట్లు నాటడం, ర్యాలీ, ప్రకృతి ప్రతిజ్ఞ వంటి వినూత్న పోటీలు, కార్యక్ర మాలను నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొం దిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భూ రక్షణ అందరి బాధ్యత చిన్న తనం నుండి ప్రకృతి పట్ల ప్రేమను కలిగి ఉన్నచో మున్ముందు భూమిని కాపాడుకోగలుగుతారని కేజీబీవీ స్పె షల్ ఆఫీసర్ మోతే స్వప్న తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎకో ఫ్రెండ్లీ టీచర్ కె.లక్ష్మీ ఉపాధ్యా య బృందం పాల్గొన్నారు.

# సినీ వినీలాకాశంలో ధృవ తార సత్యజిత్ రాయ్
## నేడు సత్యజిత్ రాయ్ వర్ధంతి

సత్యజిత్ రాయ్... సినిమాల గురించి ఏ కొంచెం అవగాహన ఉన్నా, ఈ పేరు సుపరిచితమే. ప్రపంచం లోని సినీ దర్శకులలో అగ్రశ్రేణికి చెందిన ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్. దర్శకత్వం మటుకే కాక, కథారచన, స్క్రీన్ ప్లే, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, సంగీత దర్శకత్వం, కళా దర్శకత్వం ఇలా సినిమాలకు సంబంధించిన శాఖలలోనే కాకుండా చిత్రకళ లోనూ, సాహిత్యం లోనూ సాటి లేని మేటిగా తనదైన ప్రత్యేకత చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి.

సత్యజిత్ రాయ్ (మే 2 1921--ఏప్రిల్ 23 1992) భారత దేశంలోని బెంగాల్ రాష్ట్రానికి చెందిన సినీ దర్శకుడు, రచయిత. అయన ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకడుగా పేరు గడించారు. కలకత్తాలో బెంగాలీ కళాకారుల కుటుంబములో జన్మించి ప్రెసిడెన్సీ కాలేజ్‌లో ఎకనామిక్స్ చదువుకున్న సత్యజిత్ 1940-41లో తమ కుటుంబానికి మిత్రుడైన రవీంద్ర నాథ ఠాకూర్ బతికుండగానే శాంతినికేతన్ వెళ్ళి చిత్రకళ అభ్యసించారు. సినిమాలూ, గ్రామఫోన్ రికార్డ్ల మోజుతో 1942లో కలకత్తాకు తిరిగి వచ్చారు. 1943 నుంచి సుమారు పన్నెండేళ్ళపాటు ఒక బ్రిటిష్ అడ్వర్టైజింగ్ కంపెనీలో పని చేశాక సినీ రంగంలో కాలు మోపారు. 1955లో పథేర్ పాంచాలీ సినిమాకు దర్శకత్వం వహించిన తరవాత దర్శకుడుగా దేశవిదేశాల్లో పేరు సంపాదించు కున్నారు. అంతకు ముందే కలకత్తా ఫిల్మ్ సొసైటీని స్థాపించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. 1949లో కలకత్తాకు వచ్చిన ప్రసిద్ధ ఫ్రెంచ్ దర్శకుడు ఝ్యాఁ రెన్వార్ వెంట తిరిగి సమకాలీన సినిమా గురించి అవగాహన చేసుకున్నారు.



సంవత్సరానికి ఒక సినిమా చొప్పున అతను దర్శకత్వం వహించిన సినిమాలన్నీ ప్రపంచ ప్రసిద్ధిని పొందాయి. కొన్ని బెంగాలీ సాహిత్యం నుంచీ తీసుకున్న కథలైతే కొన్ని స్వయంగా రాసుకున్నవి. సీరియస్ కళాఖండాలే కాక పిల్లల కోసం సాహసాలూ, హాస్యంతో కూడిన సినిమాలూ తీశారు. సున్నితమైన హాస్యం, వ్యంగ్యం, వాస్తవిక జీవిత చిత్రణ, అపూర్వం అనిపించే సినీ పరిభాషా, కళా నైపుణ్యం అడుగడుగునా ఆయన సినిమాల్లో కనిపిస్తాయి. ప్రపంచంలోని ఫిల్మ్ ఇన్స్టిట్యూట్లన్నీ ప్రత్యేకంగా అధ్యయనం చేసే దర్శకుల్లో రాయ్ ఒకరు. రవీంద్రుడి 'చారులతా' మొదలుకొని పిల్లల సినిమా 'గోపీ గాయేన్' వంటి జానపద చిత్రాలూ, హిందీలో ప్రేంచంద్ కథ ఆధారంగా 'శత్‌రంజ్ కే ఖిలాడీ', రవీంద్రనాథ ఠాకూర్ మీద అద్భుతమైన డాక్యుమెంటరీ ఒకటీ ఇలా ప్రతీ ఒక్కటీ కళాఖండం అనిపించేట్టుగా నిర్మించారు. ఆయనకు దర్శకత్వమే కాక, సినిమా తీయడంలోని ఇతర విభాగాల పట్ల కూడా మంచి పట్టు ఉండేది. తమ సినిమాలో చాలా వాటికి స్క్రీన్ ప్లే, కేస్టింగ్, సంగీతము, సినిమాటోగ్రఫీ, కళా దర్శకత్వము, కూర్పు, పబ్లిసిటీ డిజైన్ చేసుకోవడము – వంటివి కూడా ఆయనే చూసుకునేవారు.

రాయ్ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తము ముప్పై ఏడు చిత్రాలకు దర్శకత్వము వహించాడు. ఆయన మొదటి సినిమా పథేర్ పాంచాలీ, కేన్స్ చలనచిత్రోత్సవములో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది.

కంప్యూటర్ ఫాంట్‌లు వ్యాప్తిలోకి రాకముందే రాయ్ బెంగాలీ అక్షరమాలలో కొత్త శైలులని ప్రవేశపెట్టారు. బెంగాలీలో అనేక కథలూ, వ్యాసాలూ, నవలలూ కూడా రాశారు. సైన్స్ ఫిక్షన్, డిటెక్టివ్ సాహిత్యం మొదలైన ప్రత్యేక విషయాల గురించి కథలు రాసి, ఫేలూ దా మొదలైన పాత్రలతో జైసల్మేర్ కోట నేపథ్యంతో 'షోనార్ కెల్లా' వగైరా సినిమాలు కూడా తీశారు.

బెంగాలీ సంస్కారాన్నీ, భారతీయతనూ ఒంట పట్టించుకుని ప్రపంచ స్థాయికి ఎదిగిన సత్యజిత్ రాయ్ ఏ ప్రక్రియను చేపట్టినా ప్రతిభా వంతంగా నిర్వహించ గలిగారు. తన చిన్నతనంలోనే ఆర్థర్ కోనన్ డాయిల్ డిటెక్టివ్ కథలనూ, ఎచ్.జి.వెల్స్ తదితరుల సైన్స్ ఫిక్షన్ సాహిత్యాన్నీ అభిమానించే వారు.

సత్యజిత్ రాయ్ పిల్లల కోసం "ఫెలూదా" అన్న డిటెక్టివ్ ని సృష్టించారు. 1965 మొదలుకుని 1994 దాకా 35 ఫెలూదా నవలలు రాసారు. ఇందులో – ఫెలూదా, అతని కజిన్ తపేష్, జటాయు అని పిలువబడు లాల్ మోహన్ గంగూలీ ప్రధాన పాత్రలు. వీరు ముగ్గురు కలిసి పరిష్కరించే సమస్యల సంకలనమే ఫెలూదా కథలు. ఇది కాక సత్యజిత్ రాయ్ ప్రొఫెసర్ శొంకు అన్న మరో పాత్రని కూడా సృష్టించి నవలలు రాసారు. బెంగాలీ పిల్లల సాహిత్యంలో ఈ రెండు పాత్రలకి ఓ విశిష్ట స్థానం ఉంది.

సినిమాలు తీయడమే కాక రాయ్ ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు కూడా రాసాడు. అలాగే, ఆయన ప్రచురణ కర్త కూడా. బెంగాలీ పిల్లల పత్రిక "సందేశ్"ను చాలా ఏళ్ళు నిర్వహించాడు. అనేక అవార్డులు పుచ్చుకున్న రాయ్ 1992 లో ఆస్కార్ కూడా అందుకున్నారు.

40 ఏళ్ళు సినీరంగంలో ఓ వెలుగు వెలిగి, మరణించేందుకు 23 రోజుల ముందు ఆ పురస్కారాన్ని స్వీకరించి, ఆస్కార్ పురస్కాన్ని అందుకున్న తొలి భారతీయునిగా, ఆపైన భారతరత్న పురస్కారం పొందిన తొలి చలనచిత్ర రంగ ప్రముఖునిగా నిలిచారు. సత్యజిత్ రాయ్ మరణానంతరం భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆయన పై ఓ స్టాంపును విడుదల చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# అంకెల గారడీలో ఆదివాసీ అస్తిత్వం!
## నాయక పోడుల ఉనికిపై ప్రభుత్వ నిర్లక్ష్యం

**ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక వర్గం అభివృద్ధి చెందాలన్నా, వారికి రాజ్యాంగ ఫలాలు అందాలన్నా ప్రాథమిక ప్రాతిపదిక 'జనాభా గణాంకాలు'. కానీ, తెలంగాణలో రెండో అతిపెద్ద గిరిజన తెగగా ఉన్న 'నాయక పోడు'ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఆ జాతి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సుమారు 7 లక్షలకు పైగా ఉన్న నాయక పోడు జనాభాను కేవలం 3,81,276 కి పరిమితం చేయడం అంటే, దాదాపు సగానికి పైగా జనాభాను అధికారిక రికార్డుల్లో అదృశ్యం చేయడమే. ఇది కేవలం ఒక సాంకేతిక పొరపాటో, గణాంకాల గందరగోళమో కాదు... ఒక ప్రాచీన ఆదివాసీ జాతికి జరుగుతున్న చారిత్రక అన్యాయం.**

తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీల సామాజిక, ఆర్థిక వికాసానికి జనాభా లెక్కలే వెన్నెముక. ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, సీరియల్ నెంబర్ 6 కింద ఉన్న గోండు, నాయక పోడు, కోయతుర్, రాజ్ గోండు వంటి నాలుగు ప్రధాన తెగలు కలిపి మొత్తం 3,81,276 జనాభాతో (10.29 శాతం) ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే, ఈ గణాంకాల్లోని అంతర్గత విభజనను లోతుగా పరిశీలిస్తే నాయక పోడులకు జరుగుతున్న అన్యాయం స్పష్టమవుతోంది. వివిధ సామాజిక సర్వేలు మరియు ఆదివాసీ సంఘాల లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఈ తెగ జనాభా ఒక్కటే 7 లక్షల మార్కును దాటినప్పటికీ, నాలుగు తెగలను కలిపి కూడా కేవలం 3.81 లక్షలుగానే చూపడం వెనుక ఉన్న మతలబు ఏమిటో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

జిల్లాల వారీగా గల్లంతైన జనాభా
ప్రభుత్వ గణాంకాలు కేవలం ఐదు జిల్లాలకే పరిమితమై ఉండటం గమనార్హం. ఆదిలాబాద్ (1,41,598), ఆసిఫాబాద్ (75,312), నిర్మల్ (35,938), నిజామాబాద్ (18,885) మరియు భూపాలపల్లి (14,774) జిల్లాల్లో మాత్రమే నాయక పోడుల ఉనికిని ప్రభుత్వం గుర్తించింది. ఈ ఐదు జిల్లాలను మినహాయిస్తే రాష్ట్రంలోని మిగిలిన 28 జిల్లాల్లో అసలు నాయక పోడులు లేరా? అనే సందేహం కలుగుతోంది. ములుగు, వరంగల్, ఖమ్మం, భద్రాచలం, జగిత్యాల, కరీంనగర్, మహబూబాబాద్ వంటి జిల్లాల్లో వేల సంఖ్యలో నాయక పోడు కుటుంబాలు నివసిస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం,



వరంగల్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా కొండపోడు వ్యవసాయం చేస్తూ, తమదైన సంస్కృతిని కాపాడుకుంటున్న ఈ తెగ జనాభాను ఏ ప్రాతిపదికన విస్మరించారో అర్థం కాని పరిస్థితి. ఇక్కడ వారిని ఏ తెగ కింద లెక్కించారు? లేక వారిని ఇతర తెగలలో కలిపి చూపిస్తున్నారా? అన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి.

ఇతర తెగలలో విలీనం -- అస్తిత్వ ముప్పు
నాయక పోడుల జనాభాను ఇతర ఆదివాసీ తెగల్లో కలిపి చూపడం వల్ల వారి ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపు ప్రమాదంలో పడుతోంది. ప్రతి ఆదివాసీ తెగకు ఒక ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు, దైవారాధన, సామాజిక కట్టుబాట్లు ఉంటాయి. నాయక పోడుల జనాభాను ఇతర తెగల్లో విలీనం చేయడం ద్వారా వారి స్వయంప్రతిపత్తి కలిగిన అస్తిత్వాన్ని ప్రభుత్వం చెరిపివేస్తోంది. ఇది కేవలం జనాభా లెక్కల తగ్గింపు మాత్రమే కాదు, ఒక తెగ యొక్క ఉనికిని కాలరాయడమే. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో తమ జనాభా ఎక్కువగా ఉందని డామినేట్ చేస్తున్న వర్గాల వల్ల నాయక పోడులు సామాజికంగా ఒంటరి అవుతున్నారు. తప్పుడు గణాంకాలు ఈ ఆధిపత్య పోరాటాలను మరింత పెంచి, నాయక పోడుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

**రిజర్వేషన్లు మరియు రోస్టర్ విధానంపై ప్రభావం**

జనాభా లెక్కల్లో జరిగే ఈ తప్పులు నేరుగా నిరుద్యోగ యువత మరియు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయి.
లి?విద్యా, ఉద్యోగ అవకాశాలు:లి రాజ్యాంగం ప్రకారం జనాభా నిష్పత్తిలోనే రిజర్వేషన్లు దక్కాలి. 7 లక్షల జనాభా ఉన్న చోట 3 లక్షల పైచిలుకే చూపిస్తే, వారికి దక్కాల్సిన అవకాశాల్లో సగానికి పైగా కోత పడుతుంది.
లి?రోస్టర్ విధానం:లి ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్లు జనాభా నిష్పత్తిపై ఆధారపడి ఉంటాయి. తప్పుడు లెక్కల వల్ల నాయక పోడు అభ్యర్థులు తమకు రావాల్సిన సీట్లను, ఉద్యోగాలను శాశ్వతంగా కోల్పోయే ముప్పు పొంచి ఉంది.

సంక్షేమ పథకాలు:లి ఎస్టీ ఉప ప్రణాళిక (ట్రా) కింద కేటాయించే నిధులు మరియు జిల్లా స్థాయి సంక్షేమ పథకాలు అన్నీ అంకెల ఆధారంగానే మంజూరవుతాయి. జిల్లాల వారీగా జనాభాను గుర్తించకపోతే ఆయా ప్రాంతాల్లోని నాయక పోడులకు ప్రభుత్వం నుండి ఏ విధమైన సహాయం అందదు.

ప్రభుత్వ బాధ్యత - తక్షణ చర్యలు
ఇప్పటికే నాయక పోడు ప్రతినిధులు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ సర్వేలు శాస్త్రీయంగా లేవని, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను అధికారులు విస్మరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఎస్టీ కమిషన్‌ను కలిసి తమ నిరాశన వ్యక్తం చేస్తామని నాయక పోడు ప్రతినిధులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వాస్తవాలను గ్రహించాలి.

పారదర్శక సర్వే:లి వివాదాస్పదంగా మారిన జిల్లాలలో తక్షణమే పారదర్శకమైన మరియు శాస్త్రీయమైన 'రీ-సర్వే' నిర్వహించాలి.

ఉప తెగల గుర్తింపు:లి సీరియల్ నెంబర్ 6 లోని ఇతర తెగలతో కలపకుండా నాయక పోడు జనాభాపై స్పష్టమైన గణాంకాలు వెల్లడించాలి.

ఎస్టీ కమిషన్ జోక్యం:లి రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఈ వ్యవహారాన్ని గంభీరంగా పరిగణించి, ఆదివాసీ తెగలకు జరగబోయే అన్యాయాన్ని అడ్డుకోవాలి.
ఒక తెగ యొక్క జనాభాను తక్కువగా చూపడం అంటే ఆ తెగ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమే. తెలంగాణలో రెండో అతిపెద్ద ఎస్టీ తెగకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని సరిదిద్దకపోతే, అది సామాజిక న్యాయానికే మాయని మచ్చగా మిగిలిపోతుంది. నాయక పోడులు అడుగుతున్నది కేవలం వారి ఉనికిని గుర్తించమని మాత్రమే. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాస్తవ జనాభాను రికార్డుల్లో నమోదు చేయాలి. లేనిపక్షంలో, అస్తిత్వం కోసం వారు చేసే పోరాటం ఉధృతమయ్యే అవకాశం ఉంది. ప్రజాస్వామ్యంలో ఏ ఒక్కరి హక్కు కూడా గణాంకాల గారడీ వల్ల గల్లంతు కాకూడదని పాలకులు గుర్తించాలి

**వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863**



నినాదం

గురువారం 23 ఏప్రిల్ 2026

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

# పీఆర్సీనిని వెంటనే ప్రకటించి అమలు చేయాలి




**కమలాపూర్ ఏప్రిల్ 22 (నినాదం) :** సి పి ఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగుల పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని టి పి టీఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కమలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో గూడూరు ప్రాథమిక పాఠశాలలో మండల ప్రధాన కార్యదర్శి లకుం భాస్కర్ అధ్యక్షతనబుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి,కార్యదర్శి రావుల రమేష్ లు మాట్లాడుతూ రాష్ట్రంలోని బడి ఈడు పిల్లలందరికీ ప్రభుత్వమే బాధ్యతగా,ఉచితంగా , నాణ్యమైన విద్యను అందించాలన్నారు. దానికి కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడమే ప్రధానమైన మార్గమని తెలిపారు. ఒక ఆవాస ప్రాంతంలో చదివే పిల్లలందరూ ఆ ఆవాస ప్రాంతంలోని బడిలోనే చదివే విధంగా నైబర్హుడ్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాదిరిగా ప్రైవేటు పాఠశాలను రద్దుచేసి, ప్రభుత్వమే స్వాధీనపరచుకోవాలని కోరారు.అదేవిధంగా మొదటి పీఆర్సీ గడువు ముగిసి 33 నెలలు గడిచినప్పటికీ ,రెండవ పిఆర్సి నివేదికను తెప్పించుకొని అమలు చేయకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే రెండవ పిఆర్సి నివేదికను బహిర్గతపరిచి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేలు వర్తింపజేయాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి పర్యవేక్షణ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. హెల్త్ కార్డులను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యారంగ, సామాజిక సమకాలీన అంశాలపై ఉపాధ్యాయులను చైతన్యపరచుటకు, ప్రత్యామ్నాయ విద్యా విధానానం కొరకై ఈ నెల 30న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టి పి టి ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు ముఖ్య అతిథిగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలాస్, తెలంగాణ ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ కోదండరాం,హాజరవుతున్నారని, జాతీయ విద్యా విధానం రాజ్యాంగ విలువలు అంశంపై విద్యాఉద్యమ నాయకులు ప్రొఫెసర్ జి.హరగోపాల్ , తెలంగాణలో అసమాన విద్య విద్యారంగ సంక్షోభం అను అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ చింతకింది కాశీం , పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ రాజకీయాలు అనే అంశంపై ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కే.శ్రీనివాస్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు వేలాదిగా ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు బత్తిని శ్రీరామాంజనేయులు, టి పి టి ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాల రఘుపతి, టి పి టి ఎఫ్ సీనియర్ నాయకులు కోల రాజమల్లు, గుంటి ఎల్లయ్య ,నాయకులు పాక కుమారస్వామి,చంద్రగిరి లక్ష్మయ్య ,గొడిశాల రమేష్, నిగ్గుల బిక్షపతి, వెంకటేశ్వర్లు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## యువ క్రీడాకారులకు అండగా ఎన్నారై రవి ఫౌండేషన్



**కోదాడ,ఏప్రిల్ 22(నినాదం):** పాలవరం గ్రామంలోని యువ క్రీడా కారులను ప్రోత్సహించడం తన లక్ష్య మని ఎన్నారై రవి ఫౌండేషన్ వ్యవ స్థాపకులు బెల్లంకొండ రవి తెలిపారు. బుధవారం గ్రామ యువకులకు క్రికెట్ కిట్‌ను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువకులతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గ్రామంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.కబడ్డీ పోటీలతో పాటు పలు క్రీడా కార్యక్రమాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొంది స్తున్నామని చెప్పారు. గ్రామ యువత క్రీడల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్టపల్లి నరేష్ గౌడ్ పాల్గొని రవి చేస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



**మహదేవపూర్ ఏప్రిల్ 22, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వాయిపేటలో గుడుంబ స్థావరాలపై ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహిం చారు. గుడుంబా తయారీకి ఉపయోగించే సుమారు 350 లీటర్ల బెల్లం పాకం గుర్తించి నాశనం చేశారు, అలాగే 30 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందులు పెట్టకుండా కొనుగోళ్లు జరపాలి



**కమలాపూర్ ఏప్రిల్ 22 (నినాదం) :** రైతులను ఇబ్బందులు పెట్ట కుండా కొనుగోళ్లు జరపాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మండలంలోని కమలాపూర్, ఉప్పల్, శనిగరం,గూడూరు, పంగిడిపల్లి, మర్రిపల్లి గూడెం, గుండేడు, మాదన్నపేట, శ్రీరాములపల్లి,నెరేళ్ల, గ్రామాల్లో జిల్లా గ్రామాభివృద్ధి, సెర్ప్, ఐ కె పి,ప్రాథమిక వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ రైతులు కష్టపడి పండించిన పంటకు సరైన ధర లభించేలా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశిం చారు. ముఖ్యంగా తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. అనవసరంగా కోతలు విధించకుండా న్యాయంగా కొనుగోళ్లు జరపాలని తెలిపారు.అదేవిధంగా మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. తేమ శాతం కొంచెం అటు ఇటు ఉన్నా రైతులకు అనుకూలంగా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. రవాణా చేసే ధాన్యంని జి పి ఎస్ లో ఆన్లైన్ చేసి రైతులు అనవసరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలన్నారు.తూకం, హమాలి, రవాణా,డబ్బుల చెల్లింపుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా సహించబోమని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం శ్రీను, ఎంపీడీఓ జి బాబు, తహశీల్దార్ సురేష్ ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోటం ఝాన్సీ రాణి రవిందర్,వైస్ చైర్మన్ దేశిని అయిలయ్య, ఏపీఎం లలితా దేవి, ఆయా గ్రామాల సర్పంచ్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు,పలు శాఖల అధికారులు,సిబ్బంది,పలువురు రైతులు, కాంగ్రెస్ ,టి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరిలో ఘనంగా అన్నప్రసాద వితరణ



**కోదాడ,ఏప్రిల్ 22(నినాదం):** తెలంగాణా శబరిమలగా పేరుగాంచిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతోంది. 2026 సంక్రాంతి పండుగ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈరోజు 15వ వారంలోకి చేరుకుంది. ఈ వారానికి అమ్మగూడెం గ్రామానికి చెందిన ప్రభాకర్ గురుస్వామి--రేణుక దంపతులు దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య, అర్వపల్లి సత్యనారాయణ, జగిని ప్రసాద్, కొండపల్లి వేణుగోపాల్ రావు, కక్కిరేణి రామారావు, కుక్కడపు గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.అన్నదాన సేవను భక్తుల సహకారంతో నిరంతరంగా కొనసాగిస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్...



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన చిలువేరు పోశయ్య (66) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి పోలీసులు తెలిపారు. పాత కక్షల నేపథ్యంలో ఈ నెల 04న చిలువేరు పోశయ్యపై ఇనుగాల కుమారస్వామి అనే వ్యక్తి కర్రతో దాడి చేయగా, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ ఈ నెల18న వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుని భార్య ఫిర్యాదు ఆధారంగా బీఎన్ఎస్ సెక్షన్ 103 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేశ్ , ఎస్.ఐ ముప్పు సురేష్ సిబ్బందితో కలిసి బుధవారం మొగుళ్లపల్లి పెద్దమ్మ తల్లి గుడి సమీపంలో నిందితుడు ఇనుగాల కుమారస్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగత కక్షలు, వివాదాలను చట్టపరమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని, హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## తహసిల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు




**అమరచింత, ఏప్రిల్ 22, (నినాదం):** వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని ఆత్మకూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం తాసిల్దార్ జి కే మోహన్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వివిధ పనులపై తాసిల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులు విద్యార్థులు వివిధ రకాల ప్రజలకు ఉదాహరణ తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వేసవికాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుదాం ప్లాస్టిక్ వినియోగాన్ని నివారిద్దాం

### గుంటూరు బ్రదర్స్ చంద్రశేఖర్, రామ్మోహన్



**మిర్యాలగూడ ఏప్రిల్ 22( నినాదం ):** నేటి బాలలే రేపటి సమాజ నిర్మాతలని, పాఠశాల స్థాయి నుండే పర్యావరణశీ పట్ల అవగాహనా కలిగివుండి దరిత్రి నీ కాపాడాల్సిన అవసరం ప్రతీ విద్యార్థి పై ఉందని గుంటూరు బ్రదర్స్ చంద్రశేఖర్, రామ్మోహన్ అన్నారు. నేను నా మిర్యాలగూడ ప్రోగ్రామ్ లో మిర్యాలగూడ యంయల్ఏ బీయల్ఆర్ బ్రదర్స్ సేవలను స్ఫూర్తి గా తీసుకొని,ఏప్రిల్ 22 దరిత్రి దినోత్సవం మరియు తమ తండ్రి గారు గుంటూరు వెంకటేశ్వర్లు గారి వర్ధంతి సందర్భంగా చీరా క్యాంపు ప్రాథమిక పాఠశాల మరియు క్యాంపు ఉర్దూ మీడియం, బంగారిగడ్డ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు సుమారుగా 200 లు స్టీల్ బాటిల్స్ ను గుంటూరు కుటుంబ సభ్యులు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పేద విద్యార్థులు చదువుతున్న పాఠశాలలకు ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగించకుండా స్టీల్ బాటిల్స్ అందజేయడం అభినందనీయం అని అన్నారు. ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గతం లో కూడా గుంటూరు బ్రదర్స్ పిల్లలకు నోట్ బుక్స్ పంపిణి చేశారని, పెన్షన్ భవనం దగ్గర వృద్ధులు కూర్చోవడానికి వీలుగా సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం తో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న చంద్రశేఖర్, రామ్మోహన్ కుటుంబ సభ్యులను అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కుటుంబ సభ్యులు అరుణ, సుజాత, కోటేశ్వరి, గజ్జి శ్రవణ్ కుమార్, శ్రీదేవి,సాయిశ్రీ , శ్రీహర్ష,శ్రీహర్ష హెడ్ మాస్టర్ వకుళ ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ, ఇందిరా,గీత,ఆదిలక్ష్మి, వెంకట లక్ష్మి, దీప, మల్లేశ్వరి, స్వాతి, పాతిమా సిబ్బంది బూలక్ష్మి, మధారమ్మ విధార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

## మల్లికార్జున కార్గే క్షమాపణ చెప్పాలి

### పెద్దపల్లి జిల్లా బిజెపి నాయకులు డాక్టర్ మహమ్మద్ రఫీ

**భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 22(నినాదం):** తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఉద్దేశిస్తూ “టెర్రరిస్ట్” ఉగ్రవాది తో పోల్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే క్షమాపణ చెప్పాలని బిజెపి పెద్దపల్లి జిల్లా నాయకులు డాక్టర్ మహమ్మద్ రఫీ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్గే వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమైనవి., నిరాధారమైనవి అని అన్నారు. దేశ ప్రజల విశ్వాసంతో ఎన్నికైన ప్రధానమంత్రి గురించి ఇలాంటి అనవసర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వాక్యానించారు. కాంగ్రెస్ పార్టీ అసహనం, నిరాశకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యంలో విధానాలపై విమర్శలు సహజం కానీ వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రధానమంత్రి పదవి దేశ గౌరవానికి ప్రతీక అని అలాంటి పదవిని లక్ష్యంగా చేసుకొని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశ ప్రజలను, ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే అన్నారు. జాతీయస్థాయి నాయకులు తమ మాటలలో మరింత బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు దేశాన్ని కొత్తదిశగా నడిపిస్తున్నాయని రఫీ వివరించారు. వివాస్పద వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ వెంటనే వివరణ ఇవ్వాలని అలాగే మల్లికార్జున కార్గే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. దేశ గౌరవం సమగ్రత కాపాడడంలో బీజేపీ ఎప్పటికీ ముందు ఉంటుందని ఈ సందర్భంగా డాక్టర్ రఫీ పేర్కన్నారు.

## చలివేంద్రాలు ఏర్పాటు చేయరూ..

చలివేంద్రాల ఏర్పాటుపై అధికారుల నిర్లక్ష్యం

దాహంతో అలమటిస్తున్న కూలీలు, నిరుపేదలు

ప్రధాన కూడళ్లలో నీటి సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి

వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్



**కోదాడ,ఏప్రిల్ 22(నినాదం):** అనంతగిరి మండలంలో ఎండలు తీవ్రతరం అవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో మధ్యాహ్నం బయటకు రావడమే కష్టంగా మారింది.వివిధ పనుల కోసం బయటకు వచ్చే ప్రజలు, ప్రయాణికులు దాహం తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. అయితే ఈసారి అవి ఎక్కడా కనిపించడం లేదు.దీంతో ప్రయాణికులు నీటి కోసం దుకాణాలపై ఆధారపడాల్సి వస్తుండగా, కూలీలు, నిరుపేదలు కుళాయి నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.




చలివేంద్రాల ఏర్పాటు లేకపోవడం బాధాకరం.

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి

అనంతగిరి మండల కేంద్రంతోపాటు, గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో వెంటనే ఉచిత మంచినీటి సదుపాయం కల్పించాలి. గతంలో ప్రతి వేసవిలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఈసారి పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రధాన కూడళ్లు, రహదారులు, బస్టాండ్ల వద్ద వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా మంచినీరు అందించాలి. కూలీలు, నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.”

## బాధితుడిని పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (నినాదం) :** ఘనపూర్ మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన అశోక్ చారి ఇటీవల ప్రమాదానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అశోక్ చారిని బుధవారం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని ఫోన్ ద్వారా సూచించారు. నిరంజన్ రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్, మాజీ సర్పంచ్ నిర్మలమ్మ, కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్, సయ్యద్ జమీల్, నాగన్న యాదవ్, మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు టీపీఎఫ్ సంపూర్ణ మద్దతు

### తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్

**కాటారం, ఏప్రిల్ 22(నినాదం):** ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన సమ్మెకు టీపీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ అన్నారు. బుధవారం కాటారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీక కిరణ్ మాట్లాడారు. 41 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ కనీసం స్పందించకుండా 41 రోజుల తర్వాత ఐఏఎస్ తో కమిటీ వేశామని కార్మిక వర్గాన్ని తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించారని అన్నారు. గత ఎన్నికలలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించకుండా కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను వంచనకు గురి చేస్తుందని పేర్కొన్నారు. ఈ స్థితిలో అనివార్యమైన పరిస్థితుల్లో ఆర్టీసీ కార్మికులంతా తమ సమస్యల పరిష్కారానికి సమ్మెబాట పట్టరని, సమ్మెను పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలంతా ఆర్టీసీ కార్మిక వర్గానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్మికులంతా తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఐక్యంగా ఉండాలని, ఎన్ని ఒత్తిడిలు ఎంత నిర్బంధం ఎదురైనా చైతన్యంతో సమ్మెను కొనసాగించాలని కిరణ్ పిలుపునిచ్చారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**మంచిర్యాల, ఏప్రిల్ 22(నినాదం):** ప్రజలకు మెరుగైన వైద్యం అందించినప్పుడే ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరుగుతుందని మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ మధుకర్ పేర్కొన్నారు. బుధవారం నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వైద్య సేవలు,పేషెంట్లు కు కల్పిస్తున్న వైద్య సదుపాయాలపై ఆరా తీయడం జరిగింది. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పేద ప్రజలు నమ్మకంతో ఆసుపత్రికి వస్తారని డాక్టర్లు సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని,వైద్యులు సాధ్యమైనంత వరకు ప్రాథమిక వైద్యాన్ని అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పెద్ద ఆసుపత్రి కి రెఫరల్ చెయ్యాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వెంకటేష్ ఆసుపత్రి సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం
23 ఏప్రిల్
2026


## సిటీ స్కాన్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి**



వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (నినాదం) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2.55 కోట్ల సిఎస్ఆర్ నిధులతో జీ జీ హెచ్ లో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ సెంటర్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ నిధులతో రూ.2.55 కోట్లతో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ సెంటర్ ను ఎంపీ మల్లురవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. దీంతో పాటుగా జి జి హెచ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన యు డి ఐ డి సదరం ప్రత్యేక పరీక్షా కేంద్రాన్ని ఎంపీ ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని మొత్తం 25 ప్రభుత్వ పాఠశాలల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ నిధులతో రూ. 40.80 లక్షలతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఎంపీ మల్లు రవి జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో రూ. 32 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పశుసంవర్ధక శాఖ భవనాన్ని ఎంపీ మల్లు రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ జీజీహెచ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ సెంటర్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రికి వచ్చే నిరుపేద వైద్యులకు దీనిని సద్వినియోగం చేయాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో రూ.40.80 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిర్మాణం చేపట్టారన్నారు. అదేవిధంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే విధంగా గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రాలను కూడా అన్నారు. ఇన్ని సేవలు చేయడం అభినందనీయమని కొనియాడారు.

**-చిట్యాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం**

వనపర్తి మండలం చిట్యాలలోని మహాత్మ జ్యోతిబాపూలే ప్రభుత్వ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద రూ.13.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సైన్స్ ల్యాబ్ ను ఎంపీ మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ సైన్స్ ద్వారా ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగించగలమని తెలిపారు. సైన్స్ ల్యాబ్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో అన్ని పాఠశాలాల్లో సైన్స్ లాబ్స్ ఏర్పాటు చేయించే చర్యలు తీసుకుంటామన్నారు. శాస్త్రీయ దృక్పథం అనేది చాలా ముఖ్యమని సూచించారు. తక్కువ నిధులతో ఇంత మంచి ల్యాబ్ నిర్మించడం గొప్ప విషయమని, ఇందుకోసం కృషి చేసిన జిల్లా కలెక్టర్ ను అభినందించారు. మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో డైనింగ్ హాల్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అదేవిధంగా చిట్యాల గ్రామంలో రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు గృహప్రవేశ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోగా వాటికి హాజరై ఎంపీ, ఎమ్మెల్యే లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి, అభినందనలు తెలియజేశారు. అనంతరం చిట్యాలలోని మార్కెట్ యార్డులో ఐకెపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

**-విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలి**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంపీ మల్లురవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఆదివాసీల నృత్య ప్రదర్శన తన ఎంతో ఆకట్టుకుందని ఎంపీ ప్రశంసించారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ప్రభుత్వం మంచి సౌకర్యాలు, మంచి ఆహారం అందిస్తుందని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిజిఎం రవీంద్రబాబు, మాజీ ఆర్ఎం సత్యనారాయణ, నూతన ఆర్ఎం వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్, జి జి హెచ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, ఇతర ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు ఉన్నారు

## పర్యావరణాన్ని పునర్నిర్మించుకుందాం

**డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రఘునందన్ పిలుపు**




**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (నినాదం) :** పర్యావరణాన్ని మన చేతులతోనే పునర్నిర్మించుకుందామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రఘునందన్ పిలుపునిచ్చారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కోఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని జరుపుకున్నారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుండి పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్ వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రఘునందన్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో చెట్లు నాటుకొని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. నాటిన చెట్లను సంరక్షించుకోవాలని, చెట్లను నరకవద్దని ఆయన విద్యార్థులను కోరారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఉమా, దాంసింగ్, ఏఎంఓ మహానంది, సిఎంఓ ప్రతాపరెడ్డి, ఎన్జిసి కోఆర్డినేటర్ సుదర్శన్ రావు, డాక్టర్ నరేష్ కుమార్, ప్రభుత్వ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## పౌష్టిక ఆహారంతో ఆరోగ్యవంతమైన జీవితం

**వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్**



**మిర్యాలగూడ,ఏప్రిల్ 22 (నినాదం):** చిన్నతనంలోనే పోషకాహారంతో ఆరోగ్యవంత సమాజ నిర్మాణం జరుగుతుందని మిర్యాలగూడ మునిసిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ అన్నారు. ఐసిడిఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ రేఖల మమత ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని క్లాత్ అసోసియేషన్ బిల్డింగులో పోషణ్ పక్వాడ, ఈసీసీఈ డే గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు బాలింతలలో పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన తృణధాన్యాలు, పప్పు దినుసులు, ఆకుకూరలు, పండ్లతో కూడిన ప్రదర్శనను వైస్ చైర్మన్ పరిశీలించారు. తక్కువ ఖర్చుతో లభించే పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈసీసీఈ డే, గ్రాడ్యుయేషన్ వేడుకలు ?అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు ప్రాథమిక విద్యను (ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్) పూర్తి చేసుకున్న చిన్నారుల కోసం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రాథమిక విద్యను పూర్తి చేసి, ఒకటవ తరగతిలోకి అడుగుపెడుతున్న చిన్నారులకు శిరీష పట్టాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ గౌన్లు, టోపీలు ధరించి ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారన్నారు. ?బాల్యదశలో అంగన్‌వాడీలు అందించే పునాది విద్య పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో కీలకమని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, మునిసిపల్ కౌన్సిలర్ బంటు శ్రీనివాస్, సూపర్ వైజర్లు కె.నాగమణి, నజీమ బేగం మహమ్మద్, బి.రాధిక, ఆర్.వాణి, హేమ, నిహారిక, బ్లాక్ కో ఆర్డినేటర్ ఎం.కవిత, ?అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ?పెద్ద సంఖ్యలో తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.

## చెట్లను నాటాలి పర్యావరణాన్ని రక్షించుకోవాలి

**చినుకులు భూమిలోకి ఇంకే ఏర్పాటు చేసుకోవాలి**

**వనిత జ్యోతి మహిళా సంఘం చీఫ్ ఫంక్షనరీ ఏకే.ఖమర్ రహమాన్**




**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (నినాదం) :** చెట్లను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, ప్రతి చినుకును భూమిలోకి ఇంకే ఏర్పాటు చేసుకోవాలని వనిత జ్యోతి మహిళా సంఘం చీఫ్ ఫంక్షనరీ డాక్టర్ ఏకే.ఖమర్ రహమాన్ పిలుపునిచ్చారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో వనిత జ్యోతి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఎర్త్ డే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమర్ రహమాన్ మాట్లాడుతూ ప్రకృతి వల్ల వచ్చే వర్షాలతో ఎక్కడికక్కడ ఆనకట్టలు వేసి నీటిని నిల్వ ఉంచుకోవాలని, ప్రతి చినుకును ఇంకుడు గుంతల ద్వారా రక్షించుకోవాలని కోరారు. నీటి వృధా కాకుండా కాపాడుకొని చెరువుల నిర్మాణం ద్వారా నీటిని నిల్వ ఉంచుకోవాలని సూచించారు. గాలి కాలుష్యాన్ని కాపాడుకోవడానికి చెట్లను నాటాలని, దీనివల్ల కార్బన్డయాక్సైడ్ ను పీల్చుకొని ఆక్సిజన్ వదిలిపెడతాయని చెప్పారు. మానవజాతి మనగడకు, జంతు జాతులకు చెట్లు ఎంతో ఉపయోగంగా ఉంటాయని చెప్పారు. భూ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన డిబేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెట్లను నరకడం వల్ల నిలువ నీడ లేక ఆశ్రయం పొందడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతి ఇంటిలో పది చెట్లను పెంచాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలు చిత్తశుద్ధితో అంకితభావంతో పారదర్శకంగా అమలు చేయాలని ఆమె కోరారు. కలుషితం కాని తాగునీరు, సాగునీరు, మంచి వాతావరణం ఉంటేనే మానవ మనుగడ కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన కోళ్ల వెంకటేష్, ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్, గంధం గట్టయ్య, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా, రతన్ నాయక్, మైనార్టీ సంఘం జిల్లా నాయకుడు బాలేమియా, డప్పు కళాకారుడు నందిమల్ల నాగరాజు, రవి యాదవ్ లు పాటల ద్వారా, పద్యాల రూపంలో పర్యావరణాన్ని ఎలా రక్షించుకోవాలో, చెట్లను, నీటిని ఏలా పరిరక్షించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (నినాదం) :** వనపర్తి పట్టణంలోని 19వ వార్డు గాంధీనగర్ కు చెందిన బోలెమోని నాగరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ వార్డు కాంగ్రెస్ నాయకులు ఎల్ఐసి కృష్ణ యాదవ్ నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ కు చెప్పారు. వారు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే అభయహస్తం ద్వారా ఆ కుటుంబానికి రూ.5000 వేల ఆర్థిక సాయాన్ని, 50 కేజీల బియ్యాన్ని ఎల్ఐసి కృష్ణ యాదవ్ ద్వారా అందించారు. ఎమ్మెల్యే మృతుడి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సదుర్ల రమేష్, బొలెమోని రమేష్, చింతకుంట మహేష్, నక్క రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## కొంపల్లి గ్రామంలో ముందస్తు బడిబాట

**మునుగోడు, ఏప్రిల్ 22 (నినాదం):** మునుగోడు మండలం కొంపల్లి గ్రామంలో, బుధవారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, గ్రామ సర్పంచ్ నిర్మల దశరథ, ఉప సర్పంచ్ వెదిరె విజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గ్రామ ప్రజలలో విద్యపై అవగాహన పెంచేందుకు ఇల్లు ఇల్లు తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు మీ పిల్లలను మన ఊర్లో ఉన్న ప్రభుత్వ బడికి పంపించాలని అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, పిల్లలను పాఠశాలలో చేర్పించడం ఎంతో ముఖ్యమని అలాగే మన ప్రభుత్వ బడిని కూడా ఎలా కాపాడుకోవాలో తల్లిదండ్రులకు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్‌లు వంటి సౌకర్యాలను తెలియజేసి, గ్రామంలో ఉన్న ప్రతి విద్యార్థి మన ఊళ్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి మంచి స్పందన చూపించి, తమ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠశాల



ప్రధానోపాధ్యాయులు గూడాపూర్ వెంకట్ నారాయణ మాట్లాడుతూ, మా పాఠశాలలో ప్రతి సబ్జెక్టుకు ఇద్దరు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల తో మంచి విద్యాబోధన చేస్తున్నామని, పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని, ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, డెస్క్ బెంచీలు, డిజిటల్ విద్యాబోధన, విద్యార్థులకు స్కాలర్షిప్లు, దూర ప్రాంతం నుండి వచ్చే విద్యార్థులకు ట్రావలింగ్ అలవెన్స్ క్రింద ప్రతి విద్యార్థికి సంవత్సరానికి 6000 చొప్పున అందించడం, జరుగుతున్నదని విద్యార్థుల కు కరాటే శిక్షణ, ఆటల్లో మంచి ప్రతిభాగలిగిన ఫిజికల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయికి క్రీడల్లో మంచి ప్రావీణ్యత పొందే విధంగా శిక్షణ ఇస్తున్నామని, ఇలాంటి ప్రత్యేకతలు ఉన్న ఈ పాఠశాలకు మన గ్రామంలో ఉన్న విద్యార్థులందరినీ మన పాఠశాలలో చేర్పించాలని, లక్షలాది రూపాయల ఖర్చు పెట్టి ప్రైవేట్ పాఠశాలలో చదివించ వద్దని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయులు బాలరాజ్ , పద్మావతి, జ్యోతి, విజయలక్ష్మి, సతీష్ కుమార్, గేర నర్సింహ, ఆఫిజా బేగం, సుధాకర్ రెడ్డి, స్వాతి, శరత్ కుమార్, కోటయ్య, అలాగే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌస్ బాబా, వెంకటయ్య, అన్న మేరీ, శ్రీకాంత్, మరియమ్మ, రేణుక, ధనలక్ష్మి, శైలజ గ్రామస్తులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీతానగరంలో అంబేద్కర్ విగ్రహ స్థాపనకు చర్యలు



**మునగాల, ఏప్రిల్ 22( నినాదం):** మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను సమాజంలో అమలు చేయాలని మునగాల మండలం సీతానగరం గ్రామస్తులు పిలుపునిచ్చారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహ స్థాపనకు సంబంధించి స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యువత చురుకుగా ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించిన అంబేద్కర్ విగ్రహం గ్రామంలో ఏర్పాటు చేయడం గర్వకారణమని తెలిపారు. అంబేద్కర్ ఒక కులం లేదా మతం కోసం కాకుండా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగం రూపొందించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లు ప్రసాద్ రావు, కొల్లు నాగేశ్వరరావు, లెక్కల సుధాకర్, పల్లపు శ్రీనివాస్, అంబేద్కర్ యూత్ మాజీ అధ్యక్షుడు పడిశాల నాగరాజు, పుల్లూరి సింహాద్రి, పుల్లూరి శివాజీ, వార్డు సభ్యుడు ఉపేందర్, సూరేపల్లి శ్రీకాంత్, పి.ఉపేందర్, వీరయ్య, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేల కాలుష్యాన్ని నిర్మూలిద్దాం.. భావితరాలను కాపాడుదాం

**ఆర్డిఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్**






వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (నినాదం) నేల కాలుష్యాన్ని నిర్మూలించి భావితరాలను కాపాడుకుందామని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్ కోరారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ మాట్లాడుతూ జాతీయ అటవీ విధానం ప్రకారం పర్యావరణంలో 33 శాతం అడవులు ఉండాలని, కానీ భారతదేశంలో కేవలం 21.7శాతం అటవీ వీస్తీర్ణం ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 24.3శాతం అటవీ విస్తీర్ణం ఉందని, అటవీ వీస్తీర్ణం తగ్గిపోవడం వల్ల వాతావరణంలో ప్రాణవాయువు శాతం తగ్గిపోతుందని, భూమిపై ఉష్ణోగ్రతలు పెరుగుతాయని అన్నారు. దీనివల్ల గ్లోబల్ వార్మింగ్ పెరిగి హిమానినాదాలు కరిగిపోవడం వల్ల సముద్రాలలో నీటి శాతం పెరిగి ప్రళయాలు వచ్చే అవకాశం ఉందని, మానవాళి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రపంచ అటవీ విస్తీర్ణంలో భారత్ తొమ్మిదో స్థానంలో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు, యువత, విద్యార్థులు, ప్రజలందరూ మొక్కలు నాటి ప్రపంచ అటవీ విస్తీర్ణంలో భారత దేశ స్థానాన్ని ఒకటి లేదా రెండవ స్థానానికి చేర్చాలనీ ఈ సందర్భంగా చిన్నమ్మ తామస్ పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో అధికంగా ఎరువులు ఉపయోగించడం వల్ల పండిన ఆహార ఉత్పత్తులను తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలతో పాటు పంటల దిగుబడి క్రమంగా తగ్గిపోయి నేల నిస్సారవంతం అవుతుందని చెప్పారు. నేలను రక్షించడానికి వ్యవసాయంలో కృత్రిమ రసాయన ఎరువులను ఉపయోగించకుండా సహజమైన సేంద్రియ ఎరువులను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల నాణ్యమైన పంట దిగుబడితో పాటు నేల ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. రైతులు, యువకులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అభివృద్ధి పేరిట అడవులు నరికి గనుల త్రవ్వకాలు చేపట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, దీనివల్ల ఋతుపవనాలలో మార్పులు వచ్చి వర్షాలు తగ్గి కరువులు సంభవిస్తాయని ఆమె గుర్తు చేశారు. దీనివల్ల వ్యవసాయంపై ప్రభావం పడి పంటలు సరిగ్గా పండగ ఆహార కొరత ఏర్పడి అనేకమంది ప్రజలు ఆకలితో అలమటించే ప్రమాదం ఉందని గుర్తుంచుకోవాలని చెప్పారు. సఖి వన్ స్టాప్ సెంటర్ వనపర్తి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కె. కవిత, ఆర్డిఎస్ స్పీకర్ ఎం.శ్రీలక్ష్మి ప్రపంచ భూమి దినోత్సవం ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, ప్రకృతి వనరుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాహిత్య కళా వేదిక నుంచి గంధం నాగరాజు పర్యావరణాన్ని కాపాడడంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించి భూమిని రక్షించాలనే సందేశాన్ని అందించారు

## నిర్మానుష్యంగా చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండ్



**మునుగోడు, ఏప్రిల్ 22 (నినాదం):** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ, ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె సెగ మునుగోడు నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా. చౌటుప్పల్ పట్టణాన్ని తాకింది. బుధవారం కార్మికులు విధులను బహిష్కరించి నిరసన బాట పట్టడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది.బస్సులు డిపోలకే పరిమితం కావడంతో పట్టణంలోని బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది. ఎక్కడికక్కడ సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు, ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో, బస్సులు నడిపేందుకు తాత్కాలిక డ్రైవర్లు,కండక్టర్ల నియమాంకం జరుగుతున్నది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యామాన్నయాలపై దృష్టి పెట్టింది. పలు డిపో మేనేజర్లు తాత్కాలిక పద్ధతిలో డ్రైవర్ల,కండక్టర్ల నియమాకాని కి నోటిఫికేషన్లు విడుదల చేశారు. పదో తరగతి సర్టిఫికెట్, ఆధార కార్డు, ఏవీ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు డిపోలు సంప్రదించాలని సూచించారు. మరోవైపు పలుచోట్ల పోలీస్ ఎస్కార్ట్ మధ్య బస్సులు నడుపుతున్నారు. ఈ సందర్భంగా, ఆటో డ్రైవర్లు భారీగా రేట్లు పెంచారు. ఎండలు విపరీతంగా ఉండటం వలన ప్రయాణికులు చాలా ఇబ్బందికి గురవుతున్నారు.

గురువారం, తెలంగాణ
23 ఏప్రిల్ 2026

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

## మొండికుంట గ్రామసభలో అభివృద్ధి తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం



**అశ్వాపురం, ఏప్రిల్ 22 (నినాదం)**
మండల పరిధిలోని మొండికుంట గ్రామపంచాయతీలో సర్పంచ్ మర్రి సంధ్య అధ్యక్షతన సాధారణ గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశంలో భాగంగా గ్రామపంచాయతీ ఆదాయం-వ్యయాల వివరాలను ప్రజలకు వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ, గ్రామంలో సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం "ప్రజాముఖి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించే అవకాశం ఉందని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో వారాంతపు సంత ఏర్పాటు, పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటు మరియు నిర్వహణపై ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా 130 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి కూడా గ్రామసభ ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల్ల శివకుమార్, పంచాయతీ కార్యదర్శి సంధ్య, వార్డు సభ్యులు రావిడి శంభారెడ్డి, రామగిరి శశిరేఖ, తోట చైతన్య, పసుల స్వరూప, గాదె మల్లిఖార్జున్, కొమరం రాము, మూతి రమణి, కొల్లు మంగమ్మతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 22( నినాదం):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికండ డివిజన్ లో విద్యుత్ సమస్యల పరిష్కారం చూపాలని మణికొండ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ప్రతినిధులు టీజీఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా ఈ సమావేశంలో మణికండ ప్రాంతానికి సంబంధించి ప్రధానంగా మూడు అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా కొత్త సబ్‌స్టేషన్ నిర్మించాలని రహదారి విస్తరణకు అడ్డుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని విద్యుత్ తీగల అల్లికను తొలగించి, ఆధునిక భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి విషయాలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

**సానుకూలంగా స్పందించిన అధికారులు**

సీఎండీ జితేష్ వి. పాటిల్ , డైరెక్టర్ (ఆపరేషన్స్) నరసింహులు , ఎస్ఈ చంద్రశేఖర్ , డిఈ రమేష్ చంద్ర ఇతర అధికారులు ఫెడరేషన్ విన్నపాలపై సీఎండీ సానుకూలంగా స్పందిస్తూ, మణికండ మౌలిక సదుపాయాల మెరుగుదలకు పూర్తి సహకారం అందిస్తామని, పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వంశీ, బాబు రావు , శంకర్ దేవ్ , డా. పి. అవినాష్ , రామయ్య , పులి మల్లికార్జున్ రావు . కాలనీవాసులు శ్రీధర్ చకిలం , రాజు మామూళ్ల , ప్రదీప్ కుమార్ రెడ్డి , ఎస్.వి.ఎన్.ఎస్ శర్మ , మహేంద్ర చారి వివిధ కాలనీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

### హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ, జిఎంకు

### పి.ఎన్.టి కాలనీ అసోసియేషన్ వినతి



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (నినాదం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పి.ఎన్.టి కాలనీలో గత వారం రోజులుగా వేధిస్తున్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ లిలిపి.ఎన్.టి కాలనీ సోషల్ వర్క్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం జలమండలి అధికారులను కలిశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ సాయి లక్ష్మి, డిప్యూటీ మేనేజర్ జవహర్ అలీలకు వినతి పత్రాన్ని సమర్పించారు. కాలనీలో గత వారం రోజులుగా బోర్ మోటార్ పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సన్ సిటీ ప్రాంతంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, అక్కడ ప్రత్యామ్నాయ రోజుల్లో క్రమబద్ధంగా నీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా పాడైన బోర్ మోటార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అసోసియేషన్ కోరింది. వినతి పత్రాన్ని స్వీకరించిన అధికారులు సానుకూలంగా స్పందించారు. ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా త్వరలోనే బోర్ల మరమ్మతులు పూర్తి చేసి, నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ పిరాసత్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి నదీమ్, హఫీజ్ ఖాన్, రిటైర్డ్ తహశీల్దార్ కుబుద్దీన్, హమీద్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రిన్సిపాల్ అహ్మద్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతిని కుటుంబానికి ఆర్థికసాయం



**కమలాపూర్ ఏప్రిల్ 22 (నినాదం) :** గత ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఎల్ఐసి ఏజెంట్ కుసుమ శ్రీనివాస్ మృతి చెందారు. హుజురాబాద్ ఎల్ఐసి ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హుజరాబాద్ బ్రాంచి ఎస్ ఓ జమ్మికుంటలో శ్రీనివాస్ సభ్యులుగా ఉన్నారు. ఎల్ ఐ సి అసోసియేషన్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మృతిని కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పంజాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చందుపట్ల నరసింహారెడ్డి, డైరెక్టర్ కొండ తిరుపతి, సభ్యులు వద్దే రమేష్, నాగవెల్లి శ్రీనివాస్, బుచ్చి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్ట్ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రపూరిత రాజకీయాలకు చెంపపెట్టు

### చింతల్ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్న బిఆర్ఎస్ శ్రేణులు





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (నినాదం)**
పీసీ ఘోష్ కమిషన్ నివేదిక పూర్తిగా తప్పని హైకోర్ట్ కొట్టివేయడంతో కుత్బుల్లాపూర్ లోని బిఆర్ఎస్ శ్రేణులు చింతల్ లోని ఎమ్మెల్యే గారి కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు తినిపించుకుంటూ సంబురాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవిభాజ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అన్నీ రంగాలలో అడుగడుగున వివక్షకు గురై ఎడారిగా మారిన తెలంగాణ ప్రాంతాన్ని కాళేశ్వరం ప్రాజెక్టుతో సస్యశ్యామలం చేసిన మహా నేత బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్ అని తెలిపారు. కాళేశ్వరంతో తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న కేసీఆర్ ను అవమానించేందుకు, అబాసుపాలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పీసీ ఘోష్ కమిషన్ పేరుతో దొంగ కమిషన్లను వేసి పెద్దలు కెసిఆర్ ను, హరీష్ రావు, అధికారులను ఇబ్బందులకు గురిచేయడం తప్పా ఆ నివేదికలో ఎటువంటి వాస్తవం లేదు. ఇదే విషయాన్ని పదే, పదే మా పార్టీ నాయకులు స్పష్టం చేశారని, ఇదే విషయాన్ని నేడు హైకోర్ట్ కూడా తమ తీర్పుతో స్పష్టం చేసిందని, ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష్య పూరిత రాజకీయాలకు చెంపపెట్టన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల పేరుతో చిల్లర రాజకీయాలు చేయడం మానుకొని, ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మె.. ఎక్కడి బస్సులు అక్కడనే



**మిర్యాలగూడ ఏప్రిల్ 22( నినాదం )**
న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెతో మిర్యాలగూడ డిపో బస్సులు డిపోలకే పరిమితం కాగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ వద్ద పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈ సమ్మె కారణంగా మిర్యాలగూడ ఆర్టీసీ డిపో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీనితో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి మిర్యాలగూడ పట్టణానికి వచ్చి వెళ్లే వేలాది మంది ప్రయాణికులు రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించబడే వరకు సమ్మె కొనసాగుతుందని కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసనల నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్, డిపో వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమ్మె కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల కోసం పట్టణానికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక వర్గాలు తెలిపాయి. ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం పరిమిత సంఖ్యలో నడుస్తున్న అద్దె బస్సులు ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోతున్నాయని, ఇది పరిస్థితిని మరింత దిగజార్చుతోందని సమాచారం. ఆర్టీసీ యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు సఫలమైతేనే ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

## అమీన్పూర్ డివిజన్ పరిధిలో సాయిరాం ఎన్‌క్లేవ్ కాలనీలో పర్యటన





**అమీన్‌పూర్, ఏప్రిల్ 22,(నినాదం ):** అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి గారు సాయిరాం ఎన్క్లేవ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా, కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సి.సి. రోడ్ మరియు వర్షపు నీటి డ్రెయిన్ సమస్యలను పరిశీలించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న ఆయన, వాటిని త్వరగా పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, డి.ఈ. వెంకటరమణ, ఏ.ఇ. సునీల్, మాజీ కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్ రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- ఆర్టీసీని ప్రభుత్వంలో విడుదల చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సీపీఎం మద్దతు



**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 22 (నినాదం):** ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలనీ, ఆర్టీసీనీ ప్రభుత్వంలో విలీనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. ఈరోజు సంగారెడ్డిలో ఆర్టీసీ డిపో వద్ద వారి సమ్మెకు సీపీఎం ఆధ్వర్యంలో మద్దతు తెలుపుతూ జయరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ రోజు నుండి రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న సమ్మెకు సీపీఐ (ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ మద్దతు ప్రకటిస్తున్నదన్నారు. ఉద్యోగాల భర్తీ, కార్మికుల బకాయిల చెల్లింపు, కార్మిక సంఘం ఎన్నికలు, ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజ్ తదితర 32 డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం వేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ 4 వారాల గడువు కోరడం సమ్మెను నీరుగార్చడమేనన్నారు. ప్రభుత్వం తక్షణమే జేఏసీ నాయకులతో చర్చలు జరిపి, ఆర్టీసీ కార్మికులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులను ప్రభుత్వ ఉ ద్యోగులుగా గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్రంలో పూర్తి స్థాయిలో ఒకే ఒక్క పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణనన్నారు. అలాంటి వథకంలో పని చేస్తున్న వీరి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. సంస్థను ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించాలన్నారు. ఏళ్ల తరబడి కనీస వేతనాలు, సౌకర్యాలు లేకుండా శ్రమ దోపిడీకి గురవుతున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల పట్ల వివరించిన వైఖరి వల్లనే అధికారం కోల్పోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వానికి కూడా అలాంటి గతి పట్టకుండా సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల మరియు ఆర్టీసీ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, నాయకులు రమేష్ గౌడ్, సతీష్, రాజేష్, లక్ష్మణ్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డికి ఘన నివాళి

### ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు మణికొండ బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 22( నినాదం):** స్వర్గీయ పట్లొల్ల ఇంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మణికొండ డివిజన్ భారత రాష్ట్ర సమితి నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెక్నంపూర్ పాఠశాల వద్ద సమావేశమైన నాయకులు, ఇంద్రారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ఒక నిమిషం పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు కౌకుంట్ల గ్రామానికి చేరుకుని అక్కడ ఉన్న ఇంద్రారెడ్డి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మణికొండ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను మోసం చేస్తోందని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మణికొండ బిఆర్ఎస్ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాద్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, జైరామ్, షేక్ ఆరిఫ్ మొహమ్మద్, సుమనళిని, బాబు రావు, శ్రీనివాస్, శివ, తిరుపతి, నూకల మంజు, శ్యామలేట్ రేఖ, శ్రీను పాల్గొన్నారు.

# శ్రీ రామానుజాచార్యుల జయంతి సందర్భంగా ప్రత్యేకపూజలు



**మునగాల ,ఏప్రిల్ 22, (నినాదం)**
నేడు మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామం లో ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవాలయం లో ఉన్న శ్రీ రామానుజాచార్యుల. స్వయంభు. విగ్రహానికి. తదుపరి. ఉత్సవ విగ్రహానికి. దేవాలయం లో. బొడ్డు మండపం. పై ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ముడుంబై శేషాచార్యులు ఆధ్వర్యంలో. స్వామి వారికి. ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం లో. గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ పాల్గొని. ప్రత్యేక పూజలు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ. తమ ఇంటి వేమూరి వారి వంశ కుల దైవం అయిన. శ్రీ రామానుజాచార్యుల స్వామి వారి విగ్రహానికి నిత్యం పూజలు నిర్వహించడం. అలాగే వారి. 1009 వ జయంతి సందర్భంగా వారికి. పూజలు అభిషేకాలు నిర్వహించే. అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని. అలాగే. రామానుజాచార్యుల స్వామి వారు వేదానికి సరైన అర్థం చెప్పి. విశిష్టద్వైత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహానీయుడని గొప్ప వైష్ణవ తత్వవేత్త సంఘసంస్కర్త అని ఆయన భక్తి మార్గం కుల రహిత సమాజం మరియు ఈశ్వర ప్రవర్తి కోసం జీవితాంతం కృషి చేశారని సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి అమోఘమని కర్తవ్య దీక్ష లో ఆయన అనుసరించిన పద్ధతి. నేటి సమాజానికి యువతకు. ఆదర్శమని ప్రతి ఒక్కరు. రామానుజాచార్యుల సిద్ధాంతాలను పాటించాలని అన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ముడుంబై శేషాచార్యులు. శ్రీ ముడుంబై. లవకుశ చార్యులు. వీరబోయిన వినోద్. బారి లక్ష్మయ్య వీరబోయిన వెంకన్న కోండ్రు గోపినాథ్ గంగూరి సంతోష్ కుమార్. కనపర్తి శ్రీనివాసరావు. తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్‌లో పోషన్ పక్వాడ్



**మహదేవపూర్ ఏప్రిల్ 22, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బొమ్మపూర్-2 అంగన్వాడి సెంటర్ లో సిడిపిఓ రాధిక ఆదేశాల మేరకు పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చీర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు బదులుగా అంగన్వాడి సెంటర్లకు పంపించాలని అన్నారు. అంగన్వాడి సెంటర్ల ద్వారా చిన్నపిల్లల పోషణ, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం, రక్తహీనతకు గురికాకుండా కిశోర బాలికలకు అందించే పల్లి పట్టిలు, తల్లిపాల విశిష్టతపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుధాకర్, ఏఎన్ఎం సుశీల, అంగన్వాడి టీచర్ శ్రీలత తో పాటు గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం, తెలంగాణ
23 ఏప్రిల్ 2026

## ఘనంగా సిపిఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవ సభలు



**గుండాల, ఏప్రిల్ 22 (నినాదం):** లెనిన్ జయంతి మరియు సిపిఐ (ఎం-ఎల్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలో గుండాల,కాచనపల్లి జగ్గుతాండ, కొడవటంచ, ముత్తాపురం, మోదుగులగూడెం, నడిమిగూడెం, తూరుబాక, చెట్టుపల్లి, రేగులగూడెం గ్రామాలలో జెండాలు ఎగరవేసి సభలు, సమావేశాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గుండాల సర్పంచ్ కొరం సీతారాములు, పూణెం రంగయ్య, బచ్చల సారయ్యలు మాట్లాడుతూ 1969 ఏప్రిల్22 తేదీన లెనిన్ జయంతి సందర్భంగా సిపిఐ (ఎం-ఎల్) పార్టీఆవిర్భవించి పేద ప్రజల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించింది,ముఖ్యంగా గోదావరి లోయ పరివాహక ప్రాంతాల్లో దున్నేవానికి భూమి కావాలని నినాదంతో లక్షలాది ఎకరాలు పోడు భూములను కొట్టించి వాటి పట్టాల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించి ప్రభుత్వాల మెడలు వంచి పట్టాలు పెట్టిందని అన్నారు. ఈ పోరాటాలలో భాగంగా ఈ ప్రాంతంలో బాటన్న, కొండన్న , లింగన్న, మురళి, కాచనపల్లి అమరులు, కోటన్న,నంబూరి సీతారామారావు, నోముల పరశురాములు, సుశేన, చింత లక్ష్మి అనేకమంది తమ విలువైన ప్రాణాలను ప్రజల కోసం రక్త తరుపున చేశారని అన్నారు. వీరి ఆశయ సాధన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు బలమైన ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా, మండల నాయకులు అరేం నరేష్, పర్శక రవి, యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, పెండకట్ల పెంటన్న, ఈసం కృష్ణ,ఈసం మంగన్న, పాయం ఎల్లన్న,మానాల ఉపేందర్, తాటి రమేష్, గొగ్గేల శ్రీను,భూక్య వెంకన్న, ఈసం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న భద్రాచలం ఏఎస్పీకి సన్మానం



**అశ్వాపురం, ఏప్రిల్ 22 (నినాదం):** శివ కామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు బదిలీపై వెళ్తున్న భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌ను బుధవారం వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా దోసపాటి పిచ్చేశ్వరరావు మాట్లాడుతూ, భద్రాచలంలో విక్రాంత్ కుమార్ సింగ్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అలాగే రానున్న కాలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎస్పీగా తిరిగి రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం





**అశ్వాపురం, ఏప్రిల్ 22 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలం మిట్టగూడెం గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు మీడియం లక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే, కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల స్వప్నమైన సొంతింటి కల నిజమవుతోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు భద్రమైన నివాసం కల్పించడం ఈ పథక ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు గౌరవం, కుటుంబాలకు స్థిరత్వం, పిల్లలకు భద్రమైన వాతావరణం లభిస్తుందని తెలిపారు. ప్రతి అర్హుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, తహసిల్దార్ సూర్య ప్రకాష్, ఎంఈఓ, హౌసింగ్ ఏఈ ఉదయ్, పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్ జిమ్మ జాన్సీ, అమ్మగారిపల్లి సర్పంచ్ ఇర్ప కవిత, ఉప సర్పంచ్ శీలం సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఉసా అనిల్, సజ్జ రమేష్, జమ్మలమడి రామారావు, వాసిరెడ్డి రమేష్, కరణం రాజేశ్వరరావు, లంకమల కొండలరావు, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గొల్లపల్లి నరేష్ కుమార్, వేముల విజయ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోలా శశికాంత్, వార్డు సభ్యులు మడకం కాసులమ్మ, మేకల కళావతి, కొర్స నాగేశ్వరావు, జిమ్మ జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ పంపిణీ



**అశ్వాపురం, ఏప్రిల్ 22 (నినాదం):** ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలీల ఆరోగ్య రక్షణ కోసం అశ్వాపురం మండలంలో ఓఆర్ఎస్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో ముత్యాలరావు చేపట్టారు. మండల పరిధిలో పనిచేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తే అవకాశముందని, కూలీలు తరచుగా నీరు తాగుతూ ఓఆర్ఎస్ వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పనివేళల్లో మధ్య మధ్యలో విరామాలు తీసుకోవడం, తలకు రక్షణగా గుడ్డ లేదా టోపీ ధరించడం అవసరమన్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కూలీలు కూడా తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అస్వస్థత లక్షణాలు కనిపించిన వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు బేడీలు వేసిన మీరా.. రైతుల గురించి మాట్లాడేది

### రైతు పక్షపాతి ప్రభుత్వం.
### రుణమాఫీ, బోనస్ అందిస్తున్నాం
### మంత్రి పొంగులేటి..





**పాలేరు ఏప్రిల్ 22( నినాదం):** రైతులకు బేడీలు వేసిన చరిత్ర కలిగిన వారు. రైతుల గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర రెవిన్యూ,గృహా నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి సొసైటీ ఆధ్వర్యంలో బౌద్ధక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి వేస్తే ఉరి అన్న,గత పాలకులు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. రైతులకు బేడీలు వేసి నడిపించిన పాలకులు వారి గత చరిత్ర ను గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు చేప్పే కల్లబొల్లి మాటలు ప్రజలు వినే పరిస్థితి లో లేరని అన్నారు. వరి కి రూ. 500 బోనస్ ను ఇవ్వటంతో పాటు,25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల ను రుణమాఫీ ని అందించినట్లు తెలిపారు. గతంలో రైతు బంధు కు రూ. 10 వేలు ఇస్తే. ప్రస్తుతం రూ. 12 వేలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతు పక్షపాతి ప్రభుత్వం అన్నారు. ఇంకా మరో నాలుగు ఎన్నికలు జరిగినా ప్రజలు కాంగ్రెస్ ను దీవిస్తారని అన్నారు. రైతులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితులలో అనుకూలించకపోయినా. ప్రభుత్వం ఇచ్చిన మాట ను నిలబెట్టుకుంటున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంట ను నిల్వ,చేసుకునేందుకు వీలుగా 200 శాతం పెంచేలా కార్యాచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ప్రవేట్ రంగం కు దీటుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలను నిర్మించి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఉచిత విద్యుత్,రేషన్ కార్డులు,బస్సు ప్రయాణం లాంటి అనేక సంక్షేమ పథకాలను అప్పుల భారం ఉన్నప్పటికీ చిత్తశుద్ధి తో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతును రాజు చేయటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతుల గురించి గత పాలకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి,రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు,మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, స్థానిక నాయకులు కొడాలి గోవిందరావు,శాఖమూరి రమేష్,బచ్చలకూరి నాగరాజు,జెర్రిపోతుల అంజినీ,వెంకన్న. బొందయ్య,భద్రయ్య. నంబూరి రామారావు. వేగినాటి లక్ష్మినర్సయ్య, కర్ల ఆశోక్,పాకనాటి క న్నారెడ్డి,చెరుకుపల్లి రాజేష్. కొమ్మినేని విజయా బాబు,కడియాల నరేష్, రాయపూడి రోహిత్ వివిధ పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.

# టియుసిఐ 140వ మేడే పోస్టర్ ఆవిష్కరణ

- నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై ఉద్యమిద్దాం
- టియుసిఐ జిల్లా నాయకులు యనగంటి రమేష్



**గుండాల,ఏప్రిల్ 22 (నినాదం):** గుండాల మండల పరిధిలో మామకన్ను గ్రామపంచాయతీలో బాటన్న నగర్ కాచనపల్లి గ్రామాలలో 140వ మేడే ని విజయవంతం చేయాలని యనగంటి గణేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం టియుసిఐ జిల్లా నాయకులు యనగంటి రమేష్ మాట్లాడుతూ చికాగో నగరన చిందిన రక్తం కాలువలై ప్రవహించే నగరవీధుల్లోన జండాలేరుపేక్కినాయి ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలని పనికి తగిన ప్రతిఫలం ఇవ్వాలని పని స్థలాల్లో మెరుగైన పరిస్థితులు కావాలని పెట్టుబడిదారుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన రోజే మేడే 1886 సంవత్సరంలో మే ఒకటిన శ్రామిక వర్గ కార్మిక వర్గ పోరాట దినంగా పాటించాలని కార్మిక నాయకుల త్యాగంతో రక్త తరపనతో ఎరుపెక్కిన జెండానే సుత్తి కొడవలి జెండా కార్మిక జెండా ఆ పోరాట ఫలితమే. ప్రపంచ వ్యాప్తంగా నేడు ఎనిమిది గంటల పని దినం అమలవుతుంది ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పని భారానికి 10 గంటల పెంపుకి శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి. భారతదేశంలో కూడా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో. పరిశ్రమల్లో. షాపింగ్ మాల్స్. స్విగ్గి జోమాటోలలో ఉద్యోగులకు ఇతర రంగాలలో పనిచేస్తున్న శ్రమజీవులకు 10 గంటల పని చేయించుకోవచ్చు సవరణ కేంద్ర ప్రభుత్వం చేసింది శ్రమ దోపిడిని తీవ్రం చేసింది వేతనాలు తగ్గింపు ఉద్యోగ భద్రత లేకపోవడం సామాజిక భద్రత ఏర్పడింది మేడే స్ఫూర్తికి విఘాతం కలుగుతుంది. అమెరికా సామ్రాజ్యవాద దేశం ఇజ్రాయెల్ తో జతకట్టి ఇరాన్ పై యుద్ధం చేస్తుంది. పశ్చిమాసియా దేశాలలో ని ఆయిల్ సంపదపై రిఫైనరీల పైన ఖనిజ వనరుల పైన. ఆధిపత్యం యుద్ధ తయారీ పరిశ్రమల లాభాల కోసం యుద్ధాన్ని చేపట్టి శ్రామిక పరిశ్రమల నాశనానికి విధ్వంసానికి కారణమైంది గజ లో చిన్న పిల్లల మరణాలకు మానవ వాహనానికి విధ్వంసానికి కారణమైన వివిధ దేశాలలో ఉన్నటువంటి కార్మికకర్షకుల జీవనోపాధిపైన ఆర్థిక ఒత్తిడికి గురయ్యే విధంగా ఈపాలకులువ్యవహరిస్తున్నారని ఈ దృశ్చర్యలకు వ్యతిరేకంగా ఈ పాలకుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం పనిచేయాలని సామ్రాజ్యవాదం పాలిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మిక శక్తులు మేడే కార్యక్రమంలో పాల్గొని కార్మికుల ఐక్యతను చాటుకోవాలని మన హక్కులు సాధించుకోవడం కోసం అహర్నిశలు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ మాస్ లైన్(ప్రజాపంథ) మండల నాయకులు యనగంటి గణేష్ బాబు,గ్రామ నాయకులు మడకం లాలయ్య,కల్తి వెంకటేశ్వర్లు, పాయం కాంతయ్య ,రాకేష్, గ్రామస్తులు ఆటికం దుర్గారావు, రంగు నాగరాజు, బట్టు రాంబాబు,వెంకన్న,బట్టు ప్రవీణ్,మిడియం సంతు,యదలపల్లి చిన్న ముత్యాలు,మడకం లాలయ్య, జ్యోతి, అయితీ,మడకం జోగి,మిడియం మోటో, మాడే శ్రీను, పాయం భీమయ్య, రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



**అశ్వాపురం, ఏప్రిల్ 22 (నినాదం):** అశ్వాపురం మండలంలోని గోపాలపురం వద్ద ట్రాలీ వాహనం బైక్ ఢీకొనడంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనలో మల్లెలమడుగు గ్రామానికి చెందిన ప్రైవేట్ ఆర్టీసీ డ్రైవర్ మహేష్ గాయపడ్డాడు. ఘటన జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన మహేష్‌ను సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# నూతన డీపీఆర్ఓ ప్రేమలతకు ఘన స్వాగతం

- వరంగల్ జిల్లా కళాకారుల మర్యాదపూర్వక అభినందనలు



**నల్లబెల్లి, ఏప్రిల్ 22 (నినాదం):** వరంగల్ జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ (డీపీఆర్ఓ) నూతన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ప్రేమలత గారిని జిల్లా కళాకారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కళాకారులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో కళా, సాంస్కృతిక కార్యక్రమాల ప్రోత్సాహానికి సమాచార శాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు ఉన్న కళాకారులను ప్రోత్సహించే విధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పథకాల ప్రచారంలో స్థానిక కళారూపాలను వినియోగిస్తే కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. డీపీఆర్ఓ ప్రేమలత కళాకారులతో సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కళాకారులకు సాధ్యమైనంత సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కళా, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ కళాకారుల సంఘం అధ్యక్షుడు గడ్డం సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సింగన బోయిన లింగయ్య, టీపీసీసీ జిల్లా సాంస్కృతిక సేన సలహాదారు పాలపాక రమేష్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సాంస్కృతిక విభాగం నల్లబెల్లి మండల అధ్యక్షుడు తంగెళ్ల భాస్కర్, బుస దేవేందర్, పప్పు భద్రయ్య, సింగారబోయిన భారత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌కు విద్యే బాట

- సర్పంచ్ ఎరుకల లలిత రఘున
- పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రగతి పత్రాల పంపిణీ కార్యక్రమం



**నల్లబెల్లి, ఏప్రిల్ 22 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని మండలం నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో 2025--2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల ప్రగతి పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల హెడ్‌మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి,సహోపాధ్యాయుడు కునమల్ల రాజన్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి నాగరాజుపల్లి గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. జీవితంలో ఎదగాలంటే విద్యే ప్రధాన సాధనం అని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఆటలు, పాటలు, చిత్రలేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి, ఎంపీ పల్లి మాజీ సర్పంచ్ పాఠశాల శ్రేయోభిలాషి ఆసం చంద్రమౌళి, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం సాదాసీదాగా అయినప్పటికీ ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

# మెరిట్ ఉపకార వేతనాలు

### విద్యార్థి ప్రోత్సాహక నగదు అందజేత
### ప్రభుత్వ బడి ని ప్రోత్సాహించటం చాలా సంతోషం...ఏయంఓ ప్రభాకర్రెడ్డి





**పాలేరు ఏప్రిల్ 22( నినాదం)**
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు,నగదు ప్రోత్సాహక నగదు, మరియు,మెరిట్ స్కాలర్ షిప్ లను అందించారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించి ప్రభుత్వ బడికి సహకరిస్తున్నారు. కట్టు కాచారం గ్రామానికి చెందిన కోఠారు వెంకటేశ్వర్లు, ఏటుకూరి పుల్లయ్య కుటుంబ సభ్యులు విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మొత్తం 40 మందికి ప్రతీ ఏటా రూ. 1,000 చొప్పున ప్రతీ ఏటా అందించనున్నారు. అదే విధంగా,ప్రతీ తరగతి లో ప్రతిభ చూపిన మొదటి స్థానం కు రూ. 2 వేలు, రెండో స్థానం సాధించిన విద్యార్థులకు రూ. 1,000 చొప్పున మెరిటి స్కాలర్స్ షిప్ లను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్రెడ్డి చేతుల మీదుగా అందించారు. అనంతరం బడి బాట కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడి ని బలోపేతం చేసేందుకు స్థానికులు చేస్తున్న కృషి ని ప్రసంశించారు. ఇలాంటి వారు మరింత మంది ముందుకు వచ్చి విద్యాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. కాగా విద్యార్థులకు ప్రతీ ఏటా ఇదే మాదిరిగా అందిస్తామని దాతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం నరేందర్, సర్పంచ్ సైదులు, మాజీ సర్పంచ్ కోటి శ్రీనివాసరావు, దాతలు ఏటుకూరి వెంకయ్య, సునందాదేవి, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాందాసు, ఉపాధ్యాయులు ఇటిక్యాల సురేష్, రఫీయుద్ధన్, నారాయణరావు, కళ్యాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గే తీరుపై బీజేపీ నిరసన



**పాలేరు ఏప్రిల్ 22( నినాదం):** ప్రధానమంత్రి నరేంద్రమోడీ పై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలకు నిరసన గా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మోడీ పై అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని నిరసిస్తూ ఖర్గే దిష్టిబొమ్మ ను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా. పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడారు. బీజేపీ ని ఎదుగుదల ను తట్టుకోలేక పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలలో నమ్మకం కోల్పోయిన కాంగ్రెస్ ఇలాంటి పనులకు పాల్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ. తంగెళ్ల సతీష్,కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి, సూరేపల్లి జ్ఞానరత్నం, పిట్టల సూరిబాబు, ఎలిగేటి గిరి,వెంకట్, అనిల్,మూడు. రమేష్ శ్రీనివాసు నారాయణ, గెల్లా చక్రపాణి, వీరు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

